Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 200 విశాఖపట్నం, 22 మే 2024 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## సిట్ నివేదికపై డీజీపీతో జవహర్‌రెడ్డి సమాలోచన




**అమరావతి:** రాష్ట్రంలో ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన నేపథ్యంలో సీఎస్ జవహర్‌రెడ్డితో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా భేటీ అయ్యారు. మంగళవారం సచివాలయంలో ఇద్దరు ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. సిట్ ప్రాథమిక నివేదికపై ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వస్తే తీసుకోవాల్సి చర్యలపై ఇరువురు చర్చించినట్టు సమాచారం.

ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఏర్పాటైన సిట్ దర్యాప్తులో పోలీసుల వైఫల్యాలు వెలుగుచూశాయి. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో రెండు రోజులుగా విస్తృతంగా పర్యటించిన సిట్ బృందాలు 6 నియోజకవర్గాల పరిధిలో తీవ్ర హింసాత్మక ఘటనలకు సంబంధించి నమోదైన 33 కేసులను పరిశీలించాయి. వీటికి సంబంధించిన 150 పేజీల సమగ్ర నివేదికను సిట్ అధిపతి వినీత్ బ్రిజ్‌లాల్, ఎస్పీ రమాదేవి సోమవారం సాయంత్రం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు అందజేశారు. ఆయన ఈ నివేదికను ఎన్నికల సంఘానికి పంపించిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో సిట్ నివేదిక కలకలం రేపుతోంది. ఈసీ నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని పోలీసుశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది.

## చంద్రబాబు విదేశీయానంపై బొత్స చెమక్కులు

ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ ఇవాళ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార, విపక్ష నేతలు విదేశాల బాటపట్టడంపై స్పందించారు. చంద్రబాబు ఎక్కడికి వెళుతున్నాడో చెప్పారా? అని ప్రశ్నించారు.

చంద్రబాబు ఎందుకు చెప్పకుండా వెళ్లారు? చెబితే వచ్చే ఇబ్బంది ఏంటి? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫలానా ఊరు వెళుతున్నానని చెబితే నష్టం ఏముందని అన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న నాయకుడు ఎక్కడికైనా వెళితే ఆ విషయం చెప్పాల్సిన అవసరం ఉందని బొత్స స్పష్టం చేశారు.

"చెప్పాల్సిన అవసరం లేదంటే... మరి మా నాయకుడు వెళ్లినప్పుడు ఎందుకు పోస్టింగులు పెట్టాలి? ఎందుకు డిబేట్లు నిర్వహించాలి? ఇక రాడు... అక్కడే ఉంటాడు అంటూ ఎందుకు ప్రచారం చేయాలి? మా నాయకుడికి



వర్తించినప్పుడు మీ నాయకుడికి కూడా వర్తించదా? మీ నాయకుడు కూడా ఇక రాడు... అక్కడే ఉండిపోతాడు అని మేం అనలేమా? అప్పుడు ఐదేళ్లు ఆంధ్రాలో లేడు... ఏం జరిగినా హైదరాబాద్ పారిపోయేవాడు... ఇప్పుడు ఇండియాలోనే లేకుండా పోయాడు" అంటూ బొత్స విమర్శనాస్త్రాలు సంధించారు.

**అన్నీ తప్పుడు గణాంకాలే!**

విద్య, వైద్య రంగంలో తాము కొనసాగిస్తున్న పథకాలనే మేనిఫెస్టోలో పెట్టామని మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. మా విధానాల్లో డొల్లతనం ఉందనుకుంటే, మా విధానాల వల్ల ప్రజలు నష్టపోతున్నారనుకుంటే కూటమి ఎందుకని మరింత మెరుగైన పథకాలను మేనిఫెస్టోలో పెట్టలేకపోయిందని ప్రశ్నించారు.

దానికితోడు తప్పుడు గణాంకాలు విడుదల చేస్తున్నారని, 2019లో రాష్ట్రంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఇప్పుడు ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? నాలుగు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు అంటూ ప్రచారం చేస్తున్నారని, అది వాస్తవ విరుద్ధం అని మంత్రి బొత్స స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి వరకు 38,61,198 మంది విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. కానీ పత్రికల్లో మాత్రం 35,69,506 మంది విద్యార్థులు ఉన్నారంటూ తప్పుడు కథనాలు వేశారని, ఇదంతా విద్యావిధానంలో లోపాల వల్లేనని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

(మిగతా 2లో)

## స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. పార్లమెంటు నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్ తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్లను పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్పతో కలిసి తనిఖీ చేశారు. ప్రతి గదికీ వేసిన తాళాలను, సీళ్లను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరు, వాటి ద్వారా రికార్డయ్యే మానిటరింగ్ రూమ్ను పరిశీలించారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట స్వతంత్ర, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆర్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

## ఏపీలో అరాచకాలు జరుగుతుంటే జగన్, చంద్రబాబు విదేశాలకు వెళ్లడం ఏంటి?

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఏపీ రాజకీయ పరిణామాలపై స్పందిం చారు. రాష్ట్రంలో అల్లర్లు, అరాచకాలు జరుగుతుంటే జగన్, చంద్రబాబు విదేశాలకు వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. నాయకులకు ఉండాల్సిన లక్షణం ఇది కాదని అన్నారు. జగన్ లండన్ వెళ్లారని, చంద్రబాబు అమెరికా వెళ్లారని... వారిద్దరిదీ బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. ఏపీలో అల్లర్లపై సిట్ వేయడం వల్ల ఉపయోగం లేదని, ఇటీవలి హింసపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని నారాయణ



డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరిగిన ఘటనలపై జ్యుడిషియల్ విచారణ జరగాలని స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో వచ్చే 5 రోజులు వర్షాలు

దక్షిణాది రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, మరోవైపు ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లో వేడిగాలుల ప్రభావం కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో వచ్చే ఐదు రోజులు కోస్తా ఆంధ్ర, యానాం, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు వస్తాయని వాతావరణ అంచనా వేసింది. దీంతోపాటు తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, కర్ణాటకలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షపాతం నమోదవుతుందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో ఈనెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.


మరోవైపు ఢిల్లీతో సహా ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాలు విపరీతమైన వేడిని కలిగి ఉన్నాయి. వాతావరణ శాఖ ప్రకారం రాబోయే ఐదు రోజుల పాటు 'రెడ్ అలర్ట్' ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలో గరిష్ట



ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. మరోవైపు మే 24న ఉష్ణోగ్రత 46 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

స్కైమెట్ వెదర్ ప్రకారం

(మిగతా 2లో)




## కవిత పిటీషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పు రిజర్వ్

సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం పాలసీ మనీలాండరింగ్ కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన భారత్ రాష్ట్ర సమితి శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితకు ఇప్పట్లో ఊరట లభించే అవకాశాలు లభించట్లేదు. ఆమె ఇబ్బందులు మరింత పెరిగాయి. ఒకవంక- బెయిల్ కోసం ఆమె ప్రయత్నాలు సాగిస్తోండగా.. మరోవంక కొత్తగా సప్లిమెంటరీ ఛార్జిషీట్ సైతం దాఖలైంది.



ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆమెపై కొత్తగా ఈ సప్లిమెంట్ ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో కవితతో పాటు మరో నలుగురి పేర్లను చేర్చారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురు- దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, ఛన్‌ప్రీత్ సింగ్, అరవింద్ సింగ్‌పై గతంలోనే ఛార్జిషీట్ దాఖలైంది. సప్లిమెంటరీలోనూ వారి పేర్లు నమోదయ్యాయి.

సప్లిమెంటరీని పరిగణనలోకి తీసుకుంటే- ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం మనీలాండరింగ్ కేసులో మొత్తం మీద ఎనిమిది ఛార్జిషీట్లు దాఖలయ్యాయి. ఢిల్లీ మద్యం పాలసీ మనీలాండరింగ్ కేసులో తొలిసారిగా మార్చి 15వ తేదీన అరెస్టయ్యారు కవిత. అప్పట్లో ఆమెపై ఈడీ అధికారులు ఛార్జిషీట్ నమోదు చేశారు.

60 రోజుల్లోపల నిందితులకు శిక్ష పడకపోతే మళ్లీ కొత్త ఛార్జిషీట్‌ను ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 15వ తేదీ నాటికి దీని కాల వ్యవధి ముగిసినందున అంతకంటే ముందే కొత్తగా ఛార్జిషీట్ పెట్టారు. తాజాగా దానికి అనుబంధ ఛార్జిషీట్‌ను జాత చేశారు. దీనిపై తాజాగా ఢిల్లీ హైకోర్టు వాదనలను ఆలకించింది. కవిత, ఈడీ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు.

కాగ్నిజెన్స్ పాయింట్ కింద ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. సప్లిమెంటరీ ఛార్జిషీట్‌పై ఈ నెల 29వ తేదీన ఉత్తర్వులు జారీ చేస్తుంది. ఎలాంటి తీర్పు వెలువడుతుందనేది చర్చనీయాంశమైంది. మరోవంక- ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీపై దాఖలైన అనుబంధ ఛార్జిషీట్‌ను మే 28వ తేదీన విచారించాలని కోర్టు నిర్ణయించింది. ఆ రోజున దీనికి సంబంధించిన పిటీషన్లను లిస్టింగ్ చేసింది.

## పది సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై అధికారుల సమీక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఈ నెల 24 నుంచి జరగనున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి సప్లిమెంటరీ, ఆం.ప్ర.సార్వత్రిక విద్యాపీఠం ( ఓపెన్ స్కూల్ ) నిర్వహించే పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై మంగళవారం ఉదయం ఆయన ఛాంబరులో సమన్వయ సమావేశాన్ని జెసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని అన్నారు. ఉదయం 09.30గం.ల నుంచి మధ్యాహ్నం 12.45గం.ల వరకు జరిగే ఈ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 4,836 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందులో 2,578 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2,258 మంది ప్రైవేటు విద్యార్థులున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 20 పరీక్షా కేంద్రాలను ఎంపికచేయడంతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, స్క్వాడ్, రూట్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. పదవ తరగతి మెయిన్ పరీక్షలు మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్, తాగునీరు, రవాణా వంటి మౌలిక వసతులను కల్పించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

(మిగతా 2లో)


## ఆహ్వానం



ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువులు, విజయవాడ దరి గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో వేంచేసి యున్న భువనేశ్వరీ పీఠం యొక్క పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి వారు ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం విశాఖ నగరంలోని శంకర మఠం ఏసీ హాలు నందు అద్భుతమైన ప్రసంగం చేయనున్నారు.

విషయం
దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమాల నిర్వహణ.
ఈ సందర్భంగా శ్రీ స్వామి వారు దేవాలయాల లో ఆచరించవలసిన విధులు, విధానాలు, ఆచారాలు వంటి విలువైన విషయాలు వివరిస్తారు. ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వారికి ఉపయోగపడే అనేక విశేషాలు స్వామి వారిని అడిగి తెలుసుకోవచ్చు.

దేవాలయ నిర్వహణ కమిటీలవారు, అర్చకులు, ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వారికి మా ప్రత్యేక ఆహ్వానం.

కార్యక్రమ వివరాలు:
తేదీ 26-5-2024. ఆదివారం
వేదిక: శ్రీ శంకర మఠం
ద్వారకా నగర్, విశాఖపట్నం.
సభ ప్రారంభం: ఉదయం 9 గంటలకు.
ప్రశ్నోత్తరాలు: 12 గంటలకు.
శ్రీ స్వామి వారికి పౌర సన్మానం: 12.30 లకు.
వివరములకు: శ్రీ కమలానంద భారతి స్వామి వారి భక్త బృందం, విశాఖపట్నం.
ఫోన్: 93939 49345.

# అమ్మవారిని ఆరాధించే ఐదు పద్ధతులు ఏమిటి...?



మొదటిది విగ్రహారాధన. అమ్మవారి యొక్క విగ్రహమునో లేక చిత్రపటమునో పూజగదిలో పెట్టుకుని పూజిస్తాము. స్త్రీ సాక్షాత్తూ అమ్మవారి యొక్క అంశ స్వరూపమే కాబట్టి, నవ రాత్రులయందు లేక పుణ్య దినములయందు, కుమారీ పూజనో లేక కౌమారీ పూజనో చేస్తాం.ఇదంతా బాహ్య పూజ.

రెండో విధములో, అమ్మవారి యొక్క రూపమును లేక పాదములను మనసులో నిలిపి పూజిస్తాము. దీనినే మానసిక పూజా లేక అంతర్ముఖ పూజ అని కూడా అంటారు.

మూడవ విధానములో, కుండలినీ రూపముగా అమ్మవారిని ఆరాధించటం

కుండలిని రూప ఆరాధనకు వచ్చేసరికి, బాహ్య మరియు అంతర అనే రెండు విధానములకు అవకాశమే లేదు. కుండలిని అంతా అంతర్ముఖమే.

నాలుగవ విధానం శ్రీచక్ర ఆరాధన. ఈ విధానములో మనము శ్రీ చక్రమును ఒక యంత్ర రూపముగా కానీ, లేక ఒక ప్రతిమ రూపముగా కానీ, సంపాదించి పూజిస్తాము. కానీ ఇది కూడా, బాహ్య పూజాయే.

ఇక ఐదవ విధానములో, మనం పద్మాసనంలో కూర్చుని ఉంటే మన శరీరమే శ్రీచక్రము అని అర్థం చేసుకోగలుగుతాము మరియు మన ఉపాదిలో అనగా శరీరంలో కొలువై ఉన్న, మహాశక్తి అయినటువంటి శ్రీ కనకదుర్గా మాతను, దహరాకాశములో అనగా మన హృదయ స్థానములో, లేక చిత్తాకాశములో అనగా బృగు మధ్య స్థానములో ( అజ్ఞాచక్రములో), లేక చిదాకాశములో, నిలిపి పూజించగలుగుతాము.

శంకరులు, "సౌందర్యలహరి" లోని పదకొండవ శ్లోకాన్ని, శ్రీచక్ర స్వరూపాన్ని గూర్చి వర్ణిస్తూ, ఇలా రచించారు,

**" చతుర్భిః శ్రీకంఠైః - శివయువతిభిః పంచభిరపి**
**ప్రభిన్నాభిః శంభో - ర్నవభి రపి మూలప్రకృతిభిః**
**త్రయశ్చత్వారింశ - ద్వసుదళకళాశ్రత్రివలయ**
**త్రిరేఖాభిః సార్ధం - తవ శరణకోణాః పరిణతాః"**

అనగా,అమ్మవారు కొలువై ఉండే శ్రీచక్రము,నాలుగు శివ కోణములు మరియు ఐదు శక్తి కోణములు కలిగి, సృష్టికి మూల కారణమైన తొమ్మిది మూల ప్రకృతులతోనూ,అష్టదళపద్మమూ,షోడశదళ

పద్మమూ, మేఖలా త్రయము, రేఖా త్రయము, అనే భూపురత్రయముతోనూ కలిసి, నలభై నాలుగు అంచులు కలిగి ఉంటుంది.

భైరవ యామళము అనే గ్రంథంలో శ్రీ చక్రం గురించి ఇలా ఉంది...

శివాశివుల (అనగా పార్వతీ పరమేశ్వరుల) యొక్క శరీరమే శ్రీచక్రము.

శ్రీ చక్రములోని, త్రికోణము, అష్టకోణములు, దశకోణములు రెండూ, చతుర్దశారము అనే ఐదు శక్తి చక్రములు.

బిందువూ, అష్టదళ పద్మమూ, షోడశదళ పద్మమూ, చతుర్దశ దళ పద్మమూ, అనబడే నాలుగూ, శివ సంబంధమైన చక్రములు.

శివశక్తి చక్రముల కలయికే శ్రీచక్రము.

త్రికోణము అనే శక్తి చక్రంలో బిందువు అనే శివ చక్రము కలిసి ఉంటుంది. అలాగే అష్టకోణము అనే శక్తి చక్రములో, అష్టదళ పద్మము అనే శివ చక్రము కలిసి ఉంటుంది. శక్తి చక్రములైన దశకోణములు రెండింటిలోనూ, షోడశదళపద్మము కలిసి ఉంటుంది. చతుర్దశారము అనే శక్తి చక్రంలో, భూపురము చేరి ఉంటుంది. అలా, శ్రీచక్రము నవచక్రాత్మకము.

శ్రీచక్రము యొక్క కోణములు ఎన్ని .....

"త్రయశ్చత్వారించత్" అంటే నలుబది మూడు కోణములు అన్నది శాస్త్రము.

అవి ఏమిటి అంటే..!?,

1) శక్తి చక్రములలోని "త్రికోణానికి" ఉన్న ఊర్ధ్వకోణము = 1

2) శక్తి చక్రములలోని "అష్టకోణానికి" ఉన్న కోణములు = 8

3) శక్తి చక్రములలోని రెండు దశకోణముల లోపలా మరియు బయట ఉన్న కోణములు= 20

4) శక్తి చక్రములలోని చతుర్దశార కోణములు = 14

వెరసి నలుబది మూడు (43) కోణములు.

"నవభి రపి మూలప్రకృతిభిః" శ్రీ చక్రమునకు కారణమైన 9 కోణములే, ప్రపంచమునకు కారణమైన 9 యోనులు. ఈ నవ యోనులే పిండాండ కారణమైనటువంటి 9 ధాతువులు.

"కామికా తంత్రము" అనే గ్రంథము, ఈ తొమ్మిది ధాతువులనూ విశ్లేషిస్తుంది.

చర్మము రక్తము మాంసము మెదడు మరియు ఎముకలు అనే "అయిదు ధాతువులు" శక్తి సంబంధమైనవి.

మజ్జ అనగా ఎముకలలోని గుజ్జు, శుక్లము అనగా వీర్యము, ప్రాణము మరియు జీవము "శివ మూలకములు".

నవ ధాతుమయమే మానవ శరీరం.

శ్రీ చక్రములోని మధ్య బిందువే దశమయోని. ఆదిపరాశక్తి అయినటువంటి శ్రీ కనకదుర్గా మాత.

శ్రీ చక్రము మరియు శ్రీచక్రార్చన రెండు విధములు. 1) సమయాచారము మరియు 2) కౌలాచారము.

మనది సమయాచారము. మనం పూజించే శ్రీచక్రములో, పైకి శీర్షములు కలిగిన త్రిభుజములు నాలుగు , క్రిందికి శీర్షములు కలిగిన త్రిభుజములు ఐదు ఉంటాయి.

కౌలాచారములో పూజింపబడే శ్రీచక్రములో

పైకి శీర్షములు కలిగిన త్రిభుజములు ఐదు, క్రిందికి శీర్షములు కలిగిన త్రిభుజములు నాలుగు ఉంటాయి

శ్రీ చక్రమును అర్థము చేసుకోవటమే మహాభాగ్యము.

# పెడత్రోవ పట్టించే వార్తలపై ఐఎంపీసీసీ సమావేశం




**విజయవాడ, (పిఐబీ):** ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలోని ఆల్ ఇండియా రేడియోలో ఈరోజు ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. పత్రికా సమాచార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన ఈ సమావేశానికి PIB AP రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ (ప్రాంతం), రాజిందర్ చౌదరి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఎస్. హెచ్. రాజిందర్ చౌదరి మాట్లాడుతూ, IMPCC సమావేశం మెరుగైన సమన్వయం మరియు సమాచారాన్ని పంచుకోవడం కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ సంస్థలకు వేదికను అందించడానికి, అలాగే సంక్షోభ కమ్యూనికేషన్ మరియు ప్రతికూల వార్తలను కలిగి ఉన్న సందర్భాలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర మీడియా యూనిట్ల PSUల యొక్క ప్రతి సంస్థలో చేపడుతున్న వివిధ కార్యకలాపాలు మరియు చొరవలను హైలైట్ చేయడం కూడా దీని లక్ష్యం అని చెప్పచ్చు. మంచి PR నెట్వర్క్ను అభివృద్ధి చేయడంపై ఉద్ఘాటిస్తూ, మెరుగైన మీడియా ఏకీకరణ మరియు సినర్జీ ఆశించిన ఫలితాలు ఖచ్చితంగా సాధిస్తుందని ఆయన అన్నారు.

ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు, కార్యక్రమాలపై ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు సమాచారాన్ని అందజేయాలన్న ఆదేశంతో విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, AP రీజియన్ ప్రాంతీయ కార్యాలయం యొక్క పాత్ర మరియు విధులను చౌదరి హైలైట్ చేశారు. అలాగే ఇప్పటి వరకు సాధించిన విజయాల గురించి కూడా ఆయన పునరుద్ఘాటించారు. పిఐబి ప్రభుత్వానికి మరియు మీడియాకు మధ్య ఇంటర్ఫేస్ గా పనిచేస్తుందని, మీడియాలో ప్రతిబింబించేలా ప్రజల స్పందనపై ప్రభుత్వానికి అభిప్రాయాన్ని అందించడానికి కూడా ఇది ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

ప్రభుత్వ శాఖలు, పీఎస్ యూలు, మీడియా యూనిట్లలోని వాటాదారులందరి మధ్య సమగ్ర కమ్యూనికేషన్ మరియు మేనేజ్మెంట్ వ్యూహాన్ని రూపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు/ చర్యలను ప్రజలకు చేరవేయడం ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు.

స్థానిక సెంట్రల్ మీడియా యూనిట్లు, ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, DIPR, ఇండియా పోస్ట్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, %దీఎజూ%, ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మొదలైన వాటి అధిపతులు మరియు ప్రతినిధులు ఈ IMPCC సమావేశంలో పాల్గొన్నారు.

# శ్రీధర్ మాస్టారుకు ఆంధ్ర ప్రదేశ్ జీవవైవిధ్య సంరక్షణ అవార్డు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మే 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి గుంటూరు వారు జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలలో అవగాహన కలిగిస్తున్న వారికి ఇచ్చే జీవవైవిధ్య సంరక్షణ అవార్డుకు అనకాపల్లికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వృక్షమిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఎంపికయ్యారు. జీవ వైవిధ సంరక్షణపై ప్రజలకు అవగాహన కలిగించుట సాంప్రదాయ విజ్ఞానం ద్వారా జీవవైవిధ్యంపై జాగృతి కార్యక్రమాలు చేపట్టుట 2000 సంవత్సరం నుండి జాతీయ పర్యావరణ జాగృతి కార్యక్రమాలు ద్వారా విత్తన బ్యాంకులు ఏర్పాటు బంతుల తయారీ జీవవైవిధ్య రిజిస్టర్లు తయారీ ఔషధ మొక్కలు యూనిట్లు నెలకొల్పుట, పక్షులకు గూళ్ళు ఏర్పాటు చేయడం కాకుండా ఉచితంగా పక్షులకు తిండిగింజలు, తాగునీరు పెట్టి పాత్రలు పంపిణీ చేయుట పిచ్చుకల సంతతిని పరిరక్షించడానికి కరపత్రాలు పంపిణీ ప్రచార రథాల ద్వారా పిచ్చుకల సంతతి పరిరక్షణ ధళం ఏర్పాటు చేసి ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఇలా అనేక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టి అందరు మన్ననలు పొందిన శ్రీధర్ మాస్టారుకు అవార్డు దక్కింది. అనేక అవార్డులు పొందిన శ్రీధర్ మాస్టారకు అవార్డు రావడం పట్ల పర్యావరణ ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రీన్ క్లబ్ స్థాపించి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీధర్ మాస్టర్ కు అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రీన్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేస్తున్నారు

# ఈ నెల 25 న సాగర గణపతి ఆలయ వార్షికోత్సవం

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక సాగరతీరం వద్ద గల సాగర గణపతి ప్రథమ వార్షికోత్సవం ను ఈ నెల 25 న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘము అధ్యక్షులు గంటా నూకరాజు తెలిపారు. స్థానికం గా మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి సేవా సంఘము ఆధ్వర్యంలో ఎగువపేట గ్రామ దేవత పోలమాంబ గుడి ఆవరణలో లో నిర్మితమైన సాగర గణపతి ఆలయ వార్షికోత్సవం ను నిర్వహించనున్నామని, ఆ రాజు ఉదయంసాగర గణపతికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేఖాలు, మధ్యాహ్నం అన్న సమారాదన కార్యక్రమం ను నిర్వహించనున్న దృష్ట్యా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# తీపి జ్ఞాపకాల మామిడి



మావిడిపళ్లా?' ఒక్కరుపు అరిచాను. అవునంది అమ్మ.. ??

భలే తియ్యటి వాసన గదంతా!

గోనెపట్టామీద గడ్డిలో అప్పుడే పుట్టిన చిన్ని కృష్ణుడి లా కనబడుతున్నాయి..??

కొద్దిగా పండని పళ్ళు.. గోనెపట్టామీద గడ్డి పరిచి పళ్లన్నిటినీ పసిపాపల్లా పడుకోబెట్టి, పైన మరింత గడ్డి కప్పేసి వుంచేవారు.

మనం రోజులో పదిసార్లైనా ఆ గదిలోకెళ్లి వాటిని పరామర్శించి వచ్చేవాళ్లం.

వారం తరవాత ఒకపండు కాస్త మెత్తబడగానే టెన్త్ క్లాస్ రిజల్ట్స్ పేపర్ పట్టుకుని చేసినట్టు ఇల్లంతా తిరిగేస్తూ హడావుడి చేసేవాళ్లం.

అసలా మావిడిపళ్ల ?? ఆకలి చాలా దారుణమైన ఆకలి.

వదిలేై అన్నీ తినెయ్యాలన్నంత!

'అది కడుపా ఖండవిల్లి మడుగా? ఎన్ని తింటావు? ఆనక అజీర్తి చేస్తుంది!' అని అమ్మా, నాన్నగారు తిడుతున్నా సరే! ??

వేసంకాలం ఊరగాయల రోజుల్లో కొత్తావకాయ కలపడానికి అమ్మానాన్నా చేసే హడావుడి గమ్మత్తుగా వుండేది. నాల్రోజుల ముందునుంచీ ఊరంతా తిరిగి బారామాసి కాయలు ఎక్కడ దొరుకుతాయో చూసి కొనేవారు.

కొన్ని కాయలు చూడ్డానికి నా అంత లావున్నా పులుపుండవు. అందుకని ముందుగా ఓ కాయలోంచి చిన్నముక్క కోసిమ్మనాలి.

అది నోట్లో పెట్టుకున్న మరుక్షణం మనకి తెలీకండానే మన ఎడంకన్ను మూసుకుపోయి, ?? మన నాలుకెళ్లి అంగుట్ని 'ఠాప్' మంటూ కొట్టాలి !

'బాబోయ్, పులుపు రొడ్డు!' ?? అనేది అమ్మ.

ఆవకాయంటే ఏడాదంతా మనల్ని ఆదుకునే ఎర్రని తల్లి కదా! అంచేత కాయ గట్టిగా టెంకపట్టి, పుల్లగా వుంటేనే నిలవుంటుంది.

ఇక అసలు విషయానికొద్దాం.

వేడివేడన్నంలో అంత ఆవకాయ కలుపుకుని, పక్కన బాగా ముగ్గిన చెరుకురసం మావిడిపండొకటి పెట్టుకుని, ముద్దముద్దకీ తింటూవుంటే వుంటుందీ... నాసామిరంగా!

వేటూరి పాటని ఇళయరాజా చేత కొట్టించుకున్నంత ధీమాగా అనిపిస్తుంది

అసలు మావిడిపండెలా తినాలో పిల్లలకి మనం శిక్షణా తరగతులు నిర్వహించాలి.

ఆమధ్య సమ్మర్లో ఓరోజు హొటల్లో భోంచేస్తోంటే అన్నంలోకి అరటిపండుకి బదులు మావిడిపండిచ్చాడు.

నా పక్కన కూర్చున్నతను భోజనం అంతా అయిపోయాక పండుని 'స్స...స్స...!' అని ఓసారి గట్టిగా పీల్చి పక్కనబడేసి లేచి చెయ్యి కడిగేసుకున్నాడు. ??

నాకు వాణ్ణి చంపెయ్యాలనిపించింది.

అసలు మనం తొక్కని పిండి తిన్న తరవాత దానిమీంచి రోడ్డురోలరెక్కించి తొక్కించినా ఒక్క బొట్టుకూడా రసం రాకూడదు..?

ఇక టెంకయితే మనల్ని ఏడుస్తూ వేడుకోవాలి... 'చీకింది చాలు, ఇక ఆపరా బాబూ!' అని! అంతలా వేధించాలి మావిడిపండుని!?

అసలు వాణ్ణని ఏంలాభం??? వాళ్లమ్మా నాన్నల్ని అనాలి. పిల్లలకి సంస్కారం నేర్పకపోయినా ఫరవాలేదు, పొద్దున్నే వచ్చే వాట్సప్ ఫార్వర్డ్స్ ఓ నాలుగు చదివితే అదే వస్తుంది.

కానీ మావిడిపండు తినడం మాత్రం తప్పకుండా నేర్పాలి!

తాతగారేం చేసేవారంటే చెరుకురసాలు, పండార కలిశలు పరకల లెక్కన తెచ్చేవారు. వాటన్నింటినీ గోలెంలో నిండా నీళ్లుపోసి అందులో పడేసేవారు. ఎవడికెన్ని తినాలనిపిస్తే అన్నీ తీసుకు తినెయ్యడమే!

వెంకటేశ్వరస్వామి గుళ్లో బొట్టంత నెయ్యి, జీడిపప్పు వేసి చేసిన చక్రపొంగలి ప్రసాదం ఓ పెద్ద బేసిన్లో పెట్టేసి అక్కడెవరూ లేకుండా మనల్నే పెట్టుకు తినమంటే ఎలావుంటుంది? ఏలక్కాయ తొక్కలు కూడా మిగల్చం కదా? అచ్చం అలాగన్నమాట! ??

అమ్మ, అమ్మమ్మ అరగంటకోసారి గోడ గడియారంలో గంటలు కొట్టినట్టు 'అన్ని పళ్లు తినకండ్రా! సెగ్గడ్డలొస్తాయి!' అంటూ రాగాలు తీసేవారు. సెగ్గడ్డలొస్తే ఏదో చూర్ణం<sub></sub>వో, భస్మంవో తెచ్చుకుని వేసుకుంటాం. రెండ్రోజుల్లో మాడిపోతాయి.

మన చిన్నతనాల్లో మావిడిపళ్లు పరకలు, డజన్ల లెక్కన కొనేవాళ్లం కదా?

ఆర్నెల్లకోసారి హైదరాబాద్ వెళ్లొచ్చి నాన్నగారు 'అక్కడ మల్కాజిగిరిలో మావిడిపళ్లు కేజీల్లో కొలిచి అమ్ముతారు. కలికాలం! ఇంకా ఏంచూడాల్సొస్తుందో?' అంటూ ఆశ్చర్యం, విచారం కలిపి బాధపడిపోయేవారు.

ఇక మావిడిపళ్ల వంశంలో తనదైన స్థానం ఉన్న ఏకైక రకం... బంగినపల్లి! రసాలైతే వయసైపోయినట్టు ఒళ్లంతా ముడతలుంటాయి. కానీ ఇవలా కాదు. మంచి యవ్వనంతో మిసమిసలాడుతూ ఒక్క ముడతైనా లేకుండా నిగనిగలాడి పోతుంటాయి.

పెరుగన్నంలో బంగినపల్లి ముక్కలేసుకుని పళ్లతో గీరుకు తినడం భోజనానికి ఒక పరిపూర్ణత చేకూరుస్తుంది. కొంతమంది బొప్పాయి పళ్లకి మల్లే తొక్కలు తీయించి, పనసపొట్టులా చిన్నచిన్న ముక్కలు కోయించుకు తింటారు.

అంత రెడీమేడ్ గా తినడంకన్నా ఓ సీసాడు 'మాజా' తాగడం బెటరు.

లేకపోతే సామర్లకోట స్టేషన్లో మావిడితాండ్ర అమ్మొచ్చినపుడు కొనుక్కుతినాలి.

అంత మావిడిపళ్ల ముక్కల్ని గీరుకు తినలేనంత వ్యాపకాలేంటిట్టా?

బజారెళితే నాన్నగారు చాలా పెద్దసైజు పళ్లు అరడజను కొనేవారు. ఆయనెప్పుడూ క్యాంపులే! అట్నించి వచ్చేటప్పుడూ బోల్డన్ని తెస్తూండేవారు. పాపం ఆయన తినేది తక్కువైనా సరే పిల్లలున్నారని తెచ్చిపడేసేవారు.

అంత పెద్ద పండునీ అమ్మ కత్తిపీటతో తరిగేది. పైపెచ్చు ఓ మాటనేది...

'ఈ చెంప నీకు, ఆ చెంప అన్నయ్యకీ! సైడు ముక్కలు ఆడపిల్లలు తింటార్లే!టెంక మీరెలాగూ తినరు కాబట్టి నాకుంచెయ్యండి. అదిచాలు నాకు!'

అది బంగినపల్లి కంటే తియ్యని మనసు కదా!?? అంచేత అలానే చేస్తుంది. ఈ ముక్క రాస్తోంటే కళ్లెందుకో నీళ్లతో నిండిపోతున్నాయి.

మావిడిపండంటే తీపే కాదు!

తీపి జ్ఞాపకం కూడా!

బుధవారం 22-05-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంతరుతువు
**వైశాఖమాసం**

పంచాంగం

| | |
|---|---|
| **తిథి** | : బ. చతుర్దశి సా. 05.18 |
| **నక్షత్రం** | : స్వాతి ఉ. 06.48 |
| **వర్జ్యం** | : ప. 12.36 ల 02.20 |

(మొదటి పేజీ తరువాయిలు)

## చంద్రబాబు విదేశీయానంపై బొత్స చెమక్కులు

**ప్రతి విద్యార్థిని అంతర్జాతీయ స్థాయికి సన్నద్ధం చేస్తాం**

ఏపీలో ప్రతి విద్యార్థి గ్లోబల్ స్థాయికి ఎదిగేలా నూతన విద్యావిధానం అమలు చేస్తున్నామని మంత్రి బొత్స పేర్కొన్నారు. ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్... వచ్చే ఏడాది నుంచి అమలు చేసే ఐబీ విద్యావిధానం... ఇలా అనేక విద్యా సంస్కరణలు తెచ్చామని చెప్పారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నామని వెల్లడించారు. పేద విద్యార్థులకు అమ్మ ఒడి అమలు చేస్తున్నామని, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తున్నామని మంత్రి బొత్స వివరించారు.

## తెలుగు రాష్ట్రాల్లో వచ్చే 5 రోజులు వర్షాలు

సిక్కిం, లక్షద్వీప్‌తో పాటు ఉత్తరాఖండ్, ఈశాన్య భారతదేశంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాగా పశ్చిమ హిమాలయాలు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, దక్షిణ మధ్యప్రదేశ్‌లలో తేలికపాటి వర్షం కనిపిస్తుంది. హర్యానా, ఢిల్లీ, యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో వేడిగాలులు వీస్తాయని అంచనా వేశారు.

## పది సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై అధికారుల సమీక్ష

అమలుచేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై జెసీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పది పరీక్షలకు 2,289 మంది, ఇంటర్ పరీక్షలకు 2,547 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 02.30గం.ల నుంచి సాయంత్రం 05.30గం.ల వరకు పరీక్షలు జరుగుతాయని, జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించబడతాయని వివరించారు. వీటి నిర్వహణ కోసం ఇప్పటివరకు 9 పరీక్షా కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ప్రతీ కేంద్రం వద్ద అధికారులను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. పది సప్లిమెంటరీ పరీక్షలు, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా ఆయా అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని జెసీ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జీవిఎంసీ, పోలీస్, ఆర్.టి.సి, వైద్యఆరోగ్యం, రవాణా, తపాలా, విద్యుత్ తదితర శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
బుధవారం 22-05-2024

# రాజీవ్ గాంధీ 'చివరి ప్రయాణం' ఉత్తరాంధ్రలోనే!



మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 'చివరి ప్రయాణం' మే 21, 1991న ఉత్తరాంధ్ర నేలలోనే సాగింది. సరిగ్గా ముప్పై మూడు సంవత్సరాల క్రితం, అప్పుడు జరుగుతున్న లోక్ సభ మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించారు. ఒడిస్సా రాష్ట్ర పర్యటన అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. తొలుత పాలకొండ(రాజీవ్ అంతర్గత భద్రత సిబ్బందిలో పాలకొండవాసి ఒకరు ఉండేవారు) జూనియర్ కళాశాలలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత, శ్రీకాకుళం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన ఎన్నికల భారీ బహిరంగ సభలో, పార్టీ అభ్యర్థి డాక్టర్ కణితి విశ్వ నాథంకు మద్దతుగా పాల్గొన్నారు. తర్వాత విజయనగరం చేరుకున్నారు. రాజీవ్ రాక కోసం విజయనగరం ప్రజలు ఆ రోజు ఎంతో ఆత్రుతగా ఎదురు చూశారు. రాజీవ్ రాకతో వారంతా ఆనందంతో పొంగిపోయారు.

ఈ సందర్భంగా రాజీవ్ కు ఘనస్వాగతం లభించింది. బొబ్బిలి స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటి చేసిన ఆనంద గజపతి రాజును గెలిపించేందుకు విజయనగరం ఫుట్ బాల్ గ్రౌండ్‌లో ఎన్నికల ప్రచారసభ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం విశాఖ చేరుకొని సాగర తీరంలో స్థానిక పార్టీ అభ్యర్థి ఉమా గజపతిరాజు కు మద్దతుగా ఎన్నికల ప్రచారం సభలో పాల్గొన్నారు. స్థానిక సర్క్యూట్ హౌస్ లో కాసేపు సేద తీరారు. అక్కడ తనను కలిసిన విశాఖ కాంగ్రెస్ పార్టీనాయకుల్ని, కార్యకర్తలని కలుసుకొని సరదాగా ముచ్చటించారు.

**అఖరి నిముషంలో విమానం రెడీ! విశాఖలో ఆగిపోయి ఉంటే..?**

తమిళనాడులోని ఎన్నికల ప్రచారం కోసం సాయంత్రం ఏడున్నరకు విశాఖ నుంచి బయలుదేరి వైజాగ్ విమానాశ్రయానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కానీ విమానం బయలుదేరే సమయంలో కమ్యూనికేషన్ సిస్టం పనిచెయ్యడం లేదని పైలెట్లలో ఒకరైన కెప్టెన్ చందోక్ గమనించారు. ఈ విషయం రాజీవ్ గాంధీతో చెప్పగానే స్వయంగా పైలెట్ అయిన రాజీవ్ గాంధీ ఆయనతో కలిసి ఆ సమస్యను సరిచేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దానితో ఆ రాత్రికి వైజాగ్ లోనే ఉండిపోవడానికి సిద్ధమైన రాజీవ్ గాంధీ గెస్ట్ హౌస్ కి వెళ్లిపోయారు. ఆయన గెస్ట్ హౌస్ కి వెళ్లిపోగానే విమానం ఇంజినీర్ విమానాన్ని మరోసారి పరీక్షించి అందులోని లోపాన్ని సరిచేశారు. దీంతో విమానం రెడీ అయిపోయింది అనే వార్త విని వెంటనే రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్ కి తిరిగి వచ్చారు. అయితే వేరే కారులో వచ్చిన ఆయన సెక్యూరిటీ ఆఫీసర్ సాగర్ మాత్రం విమానాన్ని అందుకోలేకపోయారు. రాజీవ్ గాంధీతో పాటు, ఆయన మీడియా సలహాదారు సుమన్ దూబేతో పాటు బల్గేరియా నుంచి వచ్చిన ఇద్దరు జర్నలిస్టులు, పైలెట్స్ ఆ విమానంలో ఉన్నారు. సాయంత్రం 6:30 కి విశాఖలో విమానం బయలుదేరింది.

తన ఉత్తరాంధ్ర పర్యటన ముగించుకొని తమిళనాడులోని పెరుంబుదూర్‌కు రాత్రి 10 గంటలకు రాజీవ్ చేరుకున్నారు. అయితే అక్కడ జరిగిన మానవ బాంబు దాడిలో దారుణ హత్యకు గురయ్యారనే వార్త దేశ ప్రజలతోపాటు ఉత్తరాంధ్ర ప్రజానీకాన్ని శోక దుఃఖములోకి నెట్టేసింది. రాజీవ్ చివర రాజకీయ మజిలీ ఉత్తరాంధ్రయే కావడం చరిత్రలో నేడొక జ్ఞాపకంగా మిగిలిపోయింది. రాజీవ్ గాంధీ వైజాగ్ లో చివరిసారిగా ప్రసంగించిన ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాల్లో ఆయన విగ్రహంతో పాటు రాజీవ్ స్మృతి భవనాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆ విషాదాన్ని, నాటి పర్యటనను అది గుర్తుచేస్తూనే ఉంటుంది.

# ఎంతకాలం ఈ ముష్టి వ్యాపారం ?

చాలా ఏళ్ల క్రితం స్లం డాగ్ మిలీనియర్ అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో బాలలను ముష్టివాళ్లుగా మార్చి వారిచే వివిధ ప్రదేశాలలో యాచన చేయిస్తూ, వారి యాచనను ఆదాయంగా మలుచుకున్న రౌడీ ముఠాల పనితీరును స్పష్టంగా చూపించారు. అదేవిధంగా తెలుగు సినిమాలలో కూడా అప్పుడప్పుడు యాచకులను చేరదీసి వారిచే వివిధ ప్రదేశాలలో యాచన చేయించిన సంఘటనలు కూడా చాలామంది చూసే ఉంటారు.

ప్రస్తుతం విశాఖ నగరంలో యాచకుల బెడద ఎక్కువగా ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద యువతులు పసిపిల్లలను చీరలో చుట్టి నడుముకు కట్టుకొని వారికి పాలు కావాలి అంటూ యాచించడం, వారితో పాటుగా అదనంగా ఐదారేళ్ల వయస్సు గల పిల్లలు కూడా చేయి జాచి యాచిస్తూ ఉండడం సర్వసాధారణమైపోయింది. ఎర్రని ఎండలో ముక్కుపచ్చలారని పసికందులను చూపిస్తూ యాచించడం కౄరాతికౄరమైన చర్య. వీరిని ఎంత కఠినంగా శిక్షించినా తప్పులేదు.

పాలలో మత్తుమందు కలిపి పసిపిల్లలచే త్రాగించి వారిని నిద్రపుచ్చి ఎండ బాధ, హారన్ల శబ్దాలు వినబడకుండా చేసి వారిని చూపిస్తూ యాచన చేస్తున్నారని కొందరు పరిశోధకులు చెబుతున్నారు. ఇటువంటి వారందరికీ రైల్వేస్టేషన్ సమీపంలో ఒక పెద్ద ఆశ్రయ కేంద్రం ఉందని, కొందరు పెద్దలు వీరికి మద్దతుగా ఉన్నారని, వారి సహకారంతోనే ఈ వ్యాపారం జరుగుతోందని కూడా వారు తెలిపారు.

వివిధ రాష్ట్రాలకు చెందిన కొందరు వృద్ధుల బృందం రాత్రి 10 గంటల వరకు కూడా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద యాచన చేస్తోంది. చేతిలో పొడవాటి ప్లాస్టిక్ పెన్నులు పట్టుకొని వీరు కారు అద్దాలపై శబ్దం చేస్తూ యాచిస్తున్నారు. నిజంగా వీరు పొట్టకూటి కోసమే యాచిస్తున్నారా? లేక వ్యాపారం చేస్తున్నారా? అనే విషయాన్ని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలుసుకోవాలి. భారతదేశంలో యాచక వృత్తిని నిషేధించి చాలా సంవత్సరాలైంది. ప్రజలకు ఎలాగూ క్రమశిక్షణ లేదు. ఎక్కడ యాచకులకు ముష్టి వేయాలో తెలియనట్లుగానే వారు ప్రవర్తిస్తుండడం వలన యాచకుల వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది. వీరితో బాటుగా కొంతమంది దివ్యాంగులు, చెక్కకు చక్రాలు చేయించుకొని చొక్కా సైతం విప్పివేసి అర్ధనగ్నంగా ఎండలో మాడుతూ యాచిస్తున్నారు.

విశాఖనగరంలో మూగజీవుల సంరక్షణను చూసుకునే సంఘాలు కొన్ని ఉన్నాయి. వీరికి కుక్కలకు, పిల్లులకు, పులులకు భేదం తెలియదు. మున్సిపాలిటీ వారు కుక్కలను సంహరిస్తుంటే వారిపై కోర్టుకు వెళ్లి జీవహింస చేయరాదని, శునకాలకు సంతానోత్పత్తి జరుగకుండా వారికి కుటుంబ నియంత్రణ మందులు ఇంజక్షన్ల ద్వారా ఇవ్వాలని ఆర్డర్ తీసుకువచ్చారు. ఫలితంగా శునకాల ప్రకృతిపరమైన జీవితానికి ఈ ప్రకృతి ప్రేమికులు గండికొట్టారు. అంతేకాకుండా వీరి జాలి సర్కస్‌లో ఆడించే పులులపై కూడా పెరిగిపోయి నగరంలో విడిది చేసిన ఒక సర్కస్ యాజమాన్యంపై కేసువేశారు. అక్కడ కూడా విజయం సాధించి సర్కస్‌లోని పులులు, ఎలుగుబంట్లకు స్వేచ్ఛను కలిగించి వాటిని విశాఖ జంతుప్రదర్శన శాల ఎదురుగా గల కంబాల కొండ ప్రాంగణంలో ఉంచి అవి మరణించేంత వరకు కనిపెట్టుకొని ఉన్నారు. పాములకు నాగుల చవితి రోజున కోడిగుడ్లు తినిపించడాన్ని కూడా వీరు సహించరు. ఇలాంటి జంతు ప్రేమికులకు నడిరోడ్డుపై ఎండలో మలమలా మాడిపోతున్న పసికందులు కానరావడం లేదు. చొక్కాలు లేకుండా చర్మాన్ని కాల్చుకుంటున్న దివ్యాంగులు కానరావడం లేదు. ఎవరో ఒకరి సంరక్షణలో ఉండవలసిన వృద్ధులు రాత్రి 10 గంటల వరకు రోడ్లపై యాచిస్తుంటే వీరికి ఏమీ అనిపించదు. ఎందుకంటే వీరు జంతువులను మాత్రమే ప్రేమిస్తారు. మనుష్యులను పట్టించుకోరు.

ఇటీవల నగరంలో కొందరు చైతన్యవంతులైన పాత్రికేయులు యాచకుల సమస్యను తీవ్రమైనదిగా తీసుకొని అధికారులను సంప్రదిస్తున్నారు. నగరాన్ని యాచకుల నుండి ముక్తి పొందించి యాచక బాలలకు దారి చూపించాలనేది వీరి ఉద్దేశ్యం. ఉజ్వలమైన భవిష్యత్తును పసిపిల్లలు కోల్పోతున్నారనే ఆవేదన వీరిది. జర్నలిస్టుల సామాజిక మాధ్యమాలలో వీరు తమ స్పందనను తెలియజేస్తుండగా ఇతరుల నుండి మద్దతు కూడా లభిస్తోంది.

నగరంలో కోటానుకోట్లు వెచ్చించి సామాజిక సేవ చేస్తున్న ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ నిధులతో నిర్వహించబడుతున్న అనాధ ఆశ్రమాలు కూడా ఉన్నాయి. నగరప్రజలకు రక్షణ కల్పించవలసిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కూడా ఉన్నారు. ఇలాంటి యాచకులను నిత్యం గమనిస్తున్న రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో పాటుగా అటూ ఇటూ ప్రయాణించే వివిధ శాఖల అధికారులు కూడా ఉన్నారు. యాచక సమస్యపై సరిగ్గా స్పందిస్తే కేవలం మూడురోజుల్లో ఇది పరిష్కారమవుతుంది. ముఖ్యంగా యాచకులచే ఈ పని చేయించే దళారులను పట్టుకొని శిక్షించవలసిన అవసరం ఉంది. యాచకులను, బాలలను సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు అదుపులోకి తీసుకొని వారిని సంరక్షించవలసిన అవసరం కూడా ఉంది. సభ్యసమాజం కూడా స్పందించాలి.

-సూరంపూడి వీరభద్రరావు

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ద్విచక్ర వాహనం పై ఇంటికి వెళుతున్న ఓ వ్యక్తిని ఎదురుగా అతివేగం గా వస్తున్న స్విఫ్ట్ కారు బలంగా ఢీకొనడం తో తలకు, కాళ్ళు చేతులకు తీవ్ర గాయాలు అయి అక్కడి కక్కడే దుర్మరణం చెందారు. భీమిలి సి ఐ రమేష్ మంగళవారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలి మండలం రాజుల తాళ్ళవలసకు చెందిన దండు వెంకట పతి రాజు(64) విశ్రాంత పోలీస్ హెడ్ కానిస్టేబుల్. అతనికి కుమార్తె రుద్రరాజు సాయి లక్ష్మి (వివాహిత), కుమారుడు మనోజ్ వర్మ (లండన్‌లో విద్యను అభ్యసిస్తున్నాడు). ఉన్నారు. గ్రామ దేవత పండుగ నిమిత్తం వెంకట పతిరాజు మంగళవారం ఉదయం పూజా ద్రవ్యములు కొనుగోలు నిమిత్తం సంగివలస వెళ్లి తిరిగి ఇంటికి సర్వీస్ రోడ్ నుండి వస్తున్న సమయంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు (నంబర్ ఏపీ 39 క్యూవి 8548) అతన్ని బలం గా ఢీ కొట్టి వెంకట పతి రాజును కొంత దూరం ఈడ్చుకొని పోవడం తో అయన తలకు, కాళ్ల కు తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకొన్న అతని కుమార్తె సాయి లక్ష్మి సంఘటన స్థలం కు వెళ్లి తండ్రి మృత దేహాన్ని చూసి భోరున విలపించింది. చోడవరం కు చెందిన కారు డ్రైవర్ వర్రి నంద కృష్ణ (21) అతి వేగంగా కారు నడుపుతూ తండ్రి మృతికి కారణం అయ్యాడని తెలుసుకొన్న ఆమె భీమిలి పోలీస్ లకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# ఘనంగా నృసింహ జయంతి వేడుకలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక లక్ష్మీ నారసింహ క్షేత్రంలో కొలువై ఉన్న నృసింహస్వామి జయంతి వేడుకలు మంగళవారం ఘనం గా నిర్వహించబడ్డాయి.ఆలయ అనువంశిక ధర్మకర్త, ప్రధానార్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రొంపిచర్ల ప్రసాదాచార్యులు, అభినవ్ సింగరాచార్యులు, సాయి కాశ్యప్ లు 32 కళాశాలలో నింపిన సుగంధ ద్రవ్యాలు, దివ్య ఓషధులు, పంచామృతాలతో దివ్యాభిషేఖములతో స్వామి వారిని ఆర్చించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు.

# వేడుకగా పైడితల్లమ్మ జాతర



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి జోన్ 3వ డివిజన్ పరిధి నేరెళ్లవలస కోలనీ లో కొలువై ఉన్న పైడి తల్లమ్మ అమ్మవారి జాతర మంగళవారం వేడుకగా జరిగింది. దేవాలయ ధర్మకర్త రేగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం తోలేళ్ళ సంబరం కోలాహలంగా జరిగింది.మంగళవారం అమ్మవారి అనుపు ఉత్సవం సందర్భం గా జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి అమ్మవారిని దర్శించుకొన్నారు.22( బుధవారం) న అమ్మవారి పండుగ సందర్భం గా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షులు బూర అశోక్ కుమార్ తెలిపారు.


## మోహన వెంకట రెస్ట్ హోమ్స్ (రి)

**ప్రశాంతినగర్, తిరుపతి: ఫోన్ : 9393932718**

మీరు ప్రతీఏటా తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర, పద్మావతి అమ్మవార్ల దర్శనం ఇష్టంగా చేసుకుంటూ ఉంటారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల కారణంగా ఇప్పుడు తిరుపతిలో గాని, తిరుమలలో గాని వసతి చాలా కష్టమవుతోంది.

ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తిరుపతిలో (బస్‌స్టాండ్ రైల్వేస్టేషన్‌లకు కేవలం 8.5 కి.మి. దూరంలో) ప్రకృతి వనరులతో 14 ఎకరాల స్థలంలో ప్రశాంతినగర్ నిర్మాణంలో ఉంది.

అనేక అధునాతన సౌకర్యాలతో సుమారు 500 స్టూడియో అపార్ట్‌మెంట్లు మీకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే 40 అపార్ట్‌మెంట్లతో ఒక బ్లాక్ సిద్ధంగా ఉంది. 24X7 రవాణాసౌకర్యం కూడా యాజమాన్యం కల్పించింది.

సంవత్సరానికి 5 రోజులు ఈ సుఖప్రదమైన ఆవాసం పొందడానికి మీకు ఇప్పుడు చక్కని అవకాశం లభిస్తోంది. కేవలం ఒక లక్షరూపాయలు (+ 18శాతం జీఎస్టీ చెల్లించి) ఒక సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్‌ను మీరు ఒక సంవత్సరంలో 5 రోజులు చొప్పున 12 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చును.

లభించే సదుపాయాలు : ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం. 24X7 రవాణా సౌకర్యం. మీరు స్వయంగా కూడా వాహనాలు నడపవచ్చు. (2,4 వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు) 24X7 క్లినిక్, గదిలో ఫ్రిజ్, మంచం, పరుపు, ఏసీ, సోఫా, టేబుల్, ఎల్‌పీజీ స్టౌ, గిన్నెలతో సహా కిచెన్.

పూర్తి శాఖాహార భోజన, ఫలహారశాల, అన్నిరకాల వస్తుసామాగ్రి దుకాణములు, వాకింగ్ ట్రాక్, ఈతకొలను, ఔషధ మొక్కలతో కూడిన వనసంపదల ఉద్యానవనం. అహ్లాదకరమైన ఆధ్యాత్మిక సంగీతభరిత వాతావరణం, ఉచిత వైఫై లభిస్తాయి.

**24×7 రక్షణ, లాండ్రీ, ఇతర సేవలు లభిస్తాయి.**

**వివరములకు సంప్రదించండి.**

**9393949345, 8247526179**

# మీకు ఈ అలవాట్లు ఉంటే వెంటనే మానేయండి



మనం ఏమి తింటున్నామో దాని ప్రభావం శరీరంలో కనిపిస్తుంది. ఇది పేలవమైన ఆహారపు అలవాట్లతో పాటు మధుమేహం, గుండె జబ్బు లు మరియు కొన్ని క్యాన్సర్ల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది.

ఒకరి ఆహారపు అలవాట్లు అతని శారీరక ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తాయి. పూర్వం మన పూర్వీకులు తమ ఆహారపు అలవాట్ల వల్ల ఎలాంటి రోగాలు లేకుండా చాలా కాలం ఆరోగ్యంగా ఉండేవారు. కానీ నేటి ఆధునిక ప్రపంచంలో ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు వచ్చాయి. ఆ మార్పులకు అనుగుణంగా శరీరాన్ని ప్రభావితం చేసే వ్యాధులు, సమస్యల సంఖ్య కూడా పెరిగింది.

అందుకే చాలా మంది చిన్న వయసులోనే చనిపోతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కలిగి ఉండటం ద్వారా ఈ రకమైన వ్యాధులను నివారించవచ్చు మరియు నిర్వహించవచ్చు. ఒకరి ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి ఎలా హానికరమో ఇప్పుడు చూద్దాం.

**పోషకాహార లోపాలు:** అనారోగ్యకరమైన ఆహారాన్ని ఎన్నుకోవడం మరియు ఎక్కువగా తీసుకోవడం వలన, శరీరం రోజువారీ పనితీరుకు అవసరమైన పోషకాలను పొందదు మరియు పోషకాహార లోపాలను ఎదుర్కొంటుంది. పోషకాహార లోపాలు కొనసాగితే, ప్రతి అవయవం యొక్క పనితీరు ప్రభావితమవుతుంది, ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి.

**జంక్ ఫుడ్స్:** ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్స్ ఇప్పుడు అమ్ముడుపోతున్నాయి. ఈ జంక్ ఫుడ్స్ లో క్యాలరీలు ఎక్కువ మరియు ఇతర ముఖ్యమైన పోషకాలు తక్కువగా ఉంటాయి కాబట్టి, ఇలాంటి ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. ఊబకాయాన్ని అనుభవించే వ్యక్తులు గుండె జబ్బులు మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉంటారు.

**ట్రాన్స్ ఫ్యాట్స్, కొలెస్ట్రాల్, ఉప్పు మరియు చక్కెర:** ఒకరి ఆహారంలో సంతృప్త మరియు ట్రాన్స్ ఫ్యాట్స్, కొలెస్ట్రాల్, ఉప్పు మరియు చక్కెర అధికంగా ఉంటే, అది గుండె జబ్బులు, మధుమేహం మరియు క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి మీకు ఇలాంటి అలవాటు ఉంటే వెంటనే మానేయండి.

**ప్రాసెస్ చేసిన ఆహారాలు:** ప్రాసెస్ చేసిన ఆహారాలలో చక్కెర మరియు ఉప్పు ఎక్కువగా ఉంటాయి. మీరు ఈ ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎక్కువగా జోడించినప్పుడు, అది రక్తంలో చక్కెర స్థాయిలు మరియు రక్తపోటులో అసమతుల్యతను కలిగిస్తుంది. ఫలితంగా ఒకరి శక్తి స్థాయిలు మరియు మానసిక స్థితి బాగా ప్రభావితమవుతుంది.

**తక్కువ ఫైబర్ ఉన్న ఆహారాలను తీసుకోవడం:** తక్కువ ఫైబర్ మరియు ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎక్కువగా తినే ఎవరైనా మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ మరియు గుండెల్లో మంట వంటి జీర్ణ సమస్యలతో బాధపడే అవకాశం ఉంది. మీరు తరచుగా జీర్ణ సమస్యలను ఎదుర్కోవడం ప్రారంభిస్తే, అది దీర్ఘకాలంలో పెద్ద సమస్యలకు దారి తీస్తుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుకోవడం:** ఇప్పుడు మనం బలమైన రోగనిరోధక శక్తిని కలిగి ఉండవలసి వస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ బలంగా ఉండాలంటే రోజూ తగినన్ని పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలి. మీరు జంక్ ఫుడ్, వేయించిన ఆహారం, పిజ్జా మొద లైన వాటిని తీసుకుంటే, ఫలితంగా రోగనిరో ధక శక్తి బలహీనపడుతుంది మరియు మీరు తరచుగా వివిధ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారు.

# ఈ ఆకు రోజూ నమిలి తింటే మలబద్ధకం, మధుమేహం అన్నీ మాయం



సాధారణంగా చాలామంది మలబద్ధకం సమస్యను తేలిగ్గా తీసుకుంటారు. కానీ ఇది ఇతర అనారోగ్య పరిస్థితులకు కారణమౌతుంది. పరిస్థితి తీవ్రమైతే ప్రమాదకరం కావచ్చు కూడా. అందుకే సకాలంలో ఈ సమస్యకు చికిత్స ఉండేట్టు చూసుకోవాలి. మలబద్ధకం సమస్య నుంచి ఎలా విముక్తి పొందాలో తెలుసుకుందాం..

శరీరంలో సంభవించే వివిధ రకాల అనారోగ్య సమస్యలకు పరిష్కారం చాలావరకూ చుట్టూ ప్రకృతిలో లభించే వివిధ రకాల మొక్కలు, పదార్ధాల్లోనే ఉంటుంది. ఇందులో ప్రధానంగా చెప్పుకోవల్సింది తమలపాకుల గురించి.

తమల పాకులతో ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఆధునిక జీవన విధానంలో చాలామంది ఎదుర్కొనే మలబద్ధకం సమస్యతో సహా వివిధ రకాల సమస్యల్నించి తమలపాకులు కాపాడుతాయి.

కడుపు సంబంధిత సమస్యలతో బాధపడేవారు, తిన్న ఆహారం జీర్ణం కాక ఇబ్బందిపడేవాళ్లు, మలబద్ధకం సమస్య ఉన్నవాళ్లు తమలపాకుల్ని నిర్ణీత పద్ధతిలో తింటే కచ్చితంగా ఈ సమస్యలు దూరమౌతాయి. లేత తమలపాకుల్ని రోజూ 1-2 నమిలి తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఎప్పుడైతే జీర్ణక్రియ బాగుంటుందో.. మలబద్దకం సమస్య కూడా తొలగిపోతుంది. ఎందుకంటే ఆధునిక జీవన విధానంలో మలబద్ధకం సమస్య ఎక్కువగా కన్పిస్తోంది. దీనికి కారణం జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, ఆయిలీ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడమే. వీటి వల్ల జీర్ణక్రియలో సమస్య ఏర్పడి అది కాస్తా మలబద్ధకానికి ద్దారితీస్తుంది.

ఇక చర్మ సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడేవారికి తమలపాకులు అద్భుతంగా పనిచేస్తాయి. ఎందుకంటే ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. తమలపాకుల్ని సాధారణంగా మౌత్ ఫ్రెషనర్‌గా భావిస్తారు. నోటి దుర్వాసనతో బాధ పడుతుంటే తమలపాకులతో ఉపశమనం పొంద వచ్చు. ఇందులో ఉండే యాంటీ మైక్రోబయల్ గుణాలు మీ నోటి దుర్వాసనను పోగొడతాయి. అంతేకాదు..పుచ్చు పళ్లు, చిగుళ్ల సమస్యకు కూడా మంచి పరిష్కారం.

ఇక అత్యంత ప్రమాదకరమైన మధుమేహం సమస్యకు కూడా తమలపాకులే పరిష్కారం. తమలపాకులు నమిలి తినడం వల్ల రక్తంలో చక్కెర శాతం నియంత్రణలో ఉంటుంది. తమలపాకులతో కషాయం చేసుకుని కూడా తాగవచ్చు. ఏ రూపంలో తీసుకున్నా మంచి ఫలితాలుంటాయి.

# చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పి వస్తోందా?



వయస్సుతో పాటు శరీరంలో వివిధ సమస్యలు పెరుగుతాయి. అందులో ఒకటి మోకాళ్ల సమస్య. నేటి కాలంలో 30 ఏళ్లలోపే మోకాళ్లలో సమస్యలతో బాధపడుతున్నారు. మోకాళ్లు త్వరగా బలహీన పడతాయి.

వయస్సుతో పాటు శరీరంలో వివిధ సమస్యలు పెరుగుతాయి. అందులో ఒకటి మోకాళ్ల సమస్య. నేటి కాలంలో 30 ఏళ్లలోపే మోకాళ్లలో సమస్యలతో బాధ పడుతున్నారు. మోకాళ్లు త్వరగా బలహీనపడతాయి.

ఈ సమస్య నుండి బయటపడటానికి కొన్ని సహజ నివారణలు ఉన్నాయి. వీటిని అనుసరించడం ద్వారా మోకాళ్లు దృఢంగా ఉంటాయి. అలాంటి సమస్యలతో పోరాడటం సులభం అవుతుంది. అందుకోసం ఏం చేయాలో తెలుసుకుందాం.

ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యకరమైన డైట్ రొటీన్‌ను అనుసరించాలి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం అలవాటు చేసుకోండి.

ఈ పోషకాలతో పాటు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాన్ని తినండి. మోకాలి పనితీరును మెరుగుపరచడానికి మీరు అక్రోట్లను తినవచ్చు. అయితే దీన్ని కూడా పరిమితంగానే తినండి.

శరీరంలో కాల్షియం లోపం ఏర్పడిన తర్వాత, దానిని భర్తీ చేయడం చాలా కష్టం. సహజంగా కాల్షియం అందించడానికి పాల ఉత్పత్తులను తీసుకోవచ్చు. కానీ పూర్తి క్రీమ్‌తో చేసిన వాటిని ఎక్కువగా తినకూడదు. అలాగే, విటమిన్ డి కోసం కొంత సమయం పాటు ఎండలో కూర్చోవాలి.

మీకు సమయం లేకపోతే, మీరు డాక్టర్ సలహాపై సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, కొల్లాజెన్, అమైనో ఆమ్లాలు కలిగిన సప్లిమెంట్లను డైట్ రొటీన్‌లో చేర్చవచ్చు. కానీ దీనికి ముందు, వైద్యుడిని లేదా నిపుణుడిని సంప్రదించండి.

అదీకాకుండా కేవలం డైట్‌కి మాత్రమే ప్రాధాన్యత ఇస్తే సరిపోదు. దానితో పాటు శారీరక వ్యాయామం కూడా చేయాలి. ఈ సమస్య నుంచి బయటపడేందుకు నిత్యం వ్యాయామం చేయడంతోపాటు కనీసం 30 నిమిషాల పాటు నడవండి.

# ఈ 5 పప్పులు గుండెను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతాయి



పప్పుల రోజువారీ వినియోగం అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. పప్పులో ఫైబర్ ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఫైబర్ తీసుకోవడం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది, ఎందుకంటే ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.

విటమిన్ బి, ఫోలేట్, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం వంటి విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి. ఇవి మీ శరీరానికి పోషకాలను అందిస్తాయి. గుండె ఆరోగ్యంగా ఉండేందుకు ఏ పల్స్ ఎక్కువ మేలు చేస్తుందో తెలుసుకుందాం.

**మసూర్ పప్పు..** మసూర్ పప్పులో ఫైబర్ ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పప్పులో విటమిన్ బి, ఫోలేట్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి మీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మీ జీవితాన్ని ఆరోగ్యవంతంగా మార్చడంలో సహాయపడతాయి.

**శనగ పప్పు..** గుండె ఆరోగ్యానికి ముఖ్యమైన మాంసకృత్తులు చనా పప్పులో అధిక మొత్తంలో ఉంటాయి. శరీరం కండరాలను నిర్మించడంలో, మరమ్మత్తు చేయడంలో ప్రోటీన్ సహాయపడుతుంది. శనగ పప్పులో ఫైబర్ ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మల బద్ధకాన్ని నివారిస్తుంది. ఫైబర్ తీసుకోవడం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది, ఎందుకంటే ఇది కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయపడుతుంది.

**పెసర పప్పు..** పెసర పప్పు గుండెకు మంచిది, ఎందుకంటే గుండె ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఇందులో ఉన్నాయి. మూంగ్ పప్పులో మంచి మొత్తంలో మెగ్నీషియం, పొటాషియం, ఫోలేట్ , ఫైబర్ ఉన్నాయి, ఇవి గుండె ఆరోగ్యకరమైన పనితీరుకు అవసరం. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ ప్రభావం నుంచి గుండెను కాపాడి, ధమనుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

మూంగ్ తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీని రెగ్యులర్ వినియోగంతో, ధమనుల రక్త ప్రవాహం మెరుగ్గా ఉంటుంది . గుండె కండరాలు బలపడతాయి.

**కంది పప్పు..** పప్పులో ప్రోటీన్లు, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి, ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల గుండెకు హాని కలగకుండా కాపాడతాయి. ఎల్‌డిఎల్ అంటే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో , హెచ్‌డిఎల్ అంటే మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో టూర్ పప్పు సహాయపడుతుంది.

**అలిచంత పప్పు...** గుండె ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన ఫోలేట్, పొటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు అలిచంత పప్పులో ఉంటాయి. ఇది గుండె జబ్బులకు ప్రధాన కారణమైన హోమోసిస్టీన్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. అవుపేడ తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది, ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# ఖర్జూరంతో ఇది కలిపి తినండి



ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ అనారోగ్యం బారిన పడుతున్నారు. సరైన జీవనశైలి పాటించని కారణంగా 30 ఏళ్లకే ముసలి వాళ్లలా మారిపోతున్నారు. తరచూ అనారోగ్యం బారిన పడుతూ అవస్థలు ఎదుర్కొంటున్నారు. అయితే, ఆరోగ్యంగా ఉండాలంటే.. కొన్ని తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. శరీర శక్తిని పెంచుకోవాలనుకుంటే, రోగనిరోధక శక్తిని పెంచుకోవాలనుకుంటే.. ఖర్జూరం తప్పక తినాలని సూచిస్తున్నారు నిపుణులు. అంతే కాదండోయ్.. ఖర్జూరంతో పప్పు కలిపి తింటే మరింత బెనిఫిట్ ఉంటుందని చెబుతున్నారు. పోషకాలన్నీ సమృద్ధిగా ఉన్న ఈ రెండూ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. చాలా మంది పప్పు, ఖర్జూరం విడివిడిగా తింటారు. అయితే, రెండింటిని కలిపి తింటే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. మరి ఆ హెల్త్ బెనిఫిట్స్ ఏంటో ఓసారి చూద్దాం..

విటమిన్ ఎ, బి, ఫైబర్, ఐరన్, ప్రోటీన్, కాల్షియం, మెగ్నీషియం, మాంగనీస్ వంటి పోషకాలు శనగలు, ఖర్జూరం రెండింటిలోనూ ఉంటాయి. ఈ రెండింటిని కలిపి తినడం వల్ల శరీరానికి శక్తి అందడమే కాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. వీటిని తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చని చెబుతున్నారు.

**ఎముకలు బలంగా ఉంటాయి..**

శనగలు, ఖర్జూరం రెండూ కలిపి తింటే ఎముకలు దృఢంగా ఉంటాయి. ఈ రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. శరీరంలో కాల్షియం పెరిగితే ఎముకలు దృఢంగా తయారవుతాయి. వీటిని రెగ్యులర్ గా తినడం వల్ల కీళ్లకు సంబంధించిన సమస్యలను అధిగమించవచ్చు.

**మలబద్ధకం..**

ఉదర సంబంధిత సమస్యలు ఎదుర్కొంటుంటే, మలబద్ధకం సమస్య ఉన్నట్లయితే.. శనగలు, ఖర్జూరం ఈ సమస్యను నయం చేస్తాయి. ఈ రెండింటిలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. శనగలు, ఖర్జూరం కలిపి తింటే కడుపు సంబంధిత సమస్యలన్నీ నయమవుతాయి.

**రక్తహీనత..**

రక్తహీనత సమస్య ఉన్నవారు పప్పు, ఖర్జూరం తినాలి. ఈ రెండింటిలో ఐరన్ ఉంటుంది, ఇది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. రక్తహీనతను సమస్యను తగ్గిస్తుంది.

**రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి..**

తరచూ అనారోగ్యం బారిన పడటానికి కారణం.. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ. అదే రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉంటే.. ఎలాంటి వ్యాధులు రావు. అందుకే శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి శెనగలు, ఖర్జూరం తినాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. నిత్యం శనగలు, ఖర్జూరం తినడం వల్ల శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. నిజానికి, ఈ రెండింటిలోనూ ఐరన్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఈ రెంటినీ కలిపి తింటే మనలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో అనేక వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండొచ్చు. అంతేకాదు.. ఖర్జూరం తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచుతుంది.

# డ్రై ఫ్రూట్స్ తింటున్నారా.?



డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆరోగ్యంగా ఉండాలంటే గుప్పెడన్నీ డ్రై ఫ్రూట్స్ తినమని వైద్యులు సూచిస్తుంటారు. శరీరానికి మేలు చేసే ఎన్నో మంచి గుణాలు డ్రై ఫ్రూట్స్‌లో ఉంటాయి. మనలో దాదాపు చాలా మంది డ్రైఫ్రూట్స్‌నే నేరుగా తీసుకుంటారు. లేదా బాదం లాంటి కొన్నింటిని నీటిలో నానబెట్టి తీసుకుంటారు. అయితే డ్రై ఫ్రూట్స్‌ను తేనెలో నానబెట్టి తీసుకుంటే కలిగే ప్రయోజనాలు అధికం అని మీకు తెలుసా.? అవును డ్రై ఫ్రూట్స్‌ను సాధారణంగా తీసుకునే దాని కంటే తేనెలో నానబెట్టి తీసుకుంటే చాలా మేలు అని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ తేనెలో కలిపి తీసుకునే డ్రై ఫ్రూట్స్ ద్వారా ఎలాంటి లాభాలు ఉంటాయి.

తేనెలో ఉండే నేచురల్ షుగర్ శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. డ్రైఫ్రూట్స్‌లో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్, తేనెలో ఉండే మంచి గుణాలు కలిసి శరీరానికి కావాల్సిన తక్షణ శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీంతో శరీరం ఎల్లప్పుడూ చురుకుగా ఉంటుంది.

ఎండు ద్రాక్ష ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే ఎండు ద్రాక్షను తేనెలో కలుపుకొని తీసుకుంటే ఇంకా మేలు జరుగుతుందని మీకు తెలుసా.? అవును తేనెలో కలిపిన ఎండు ద్రాక్షను తీసుకుంటే గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. పొటాషియం, ఫైబర్, ఫినోలిక్ గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

డ్రై ఫ్రూట్స్‌ను తేనెలో కలుపుకొని తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా బాదం, ఖర్జూరం, అంజీర్, ఎండు ద్రాక్ష వంటి వాటిని తేనెలో కలుపుకొని తీసుకుంటే శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది.

జీర్ణ వ్యవస్థ మెరుగుపడడానికి కూడా తేనె కలిపిన డ్రై ఫ్రూట్స్ ఉపయోగపడతాయి. డ్రై ఫ్రూట్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుందనే విషయం తెలిసిందే. తేనె కలపి తీసుకోవడం ద్వారా జీర్ణ వ్యవస్థ మరింత ఆరోగ్యకరంగా మారుతుంది.

ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాలతో పోరాడడంలో తేనె ఎంతగానో ఉపయోగపడుతుంది. తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది.

ఇక ఒత్తిడిని తగ్గించడంలో కూడా తేనె కీలక పాత్ర పోషిస్తుంది. తేనె, డ్రైఫ్రూట్స్‌లోని యాంటీ ఆక్సిడెంట్స్ ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్‌ని ఇవి బ్యాలెన్స్ చేస్తాయి. వ్యాధుల నుంచి రక్షిస్తాయి.

## కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో రికార్డ్ లేని 41ద్విచక్ర వాహనాలు , ఒక ఆటో సీజ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ వారి ఆదేశాల మేరకు పరవాడ సబ్ డివిజన్, ఎలమంచిలి సర్కిల్ సిఐ గఫూర్ గారి ఆధ్వర్యంలో మునగపాక ఎస్సై ప్రసాదరావు మరియు పరవాడ సబ్ డివిజన్ సిఐలు , ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు మరియు సిబ్బంది తో నాగులాపల్లి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి భారీ ఎత్తున రికార్డ్ లేని ద్విచక్ర వాహనాలు, ఆటోను మొత్తం 42 వాహనాలు మునగపాక పోలీసులు స్వాధీనపరచుకున్నారు.ఈ సందర్భంగా ఎలమంచిలి సిఐ నాగులాపల్లి గ్రామస్తులతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అనుమానస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామని తెలిపారు. గ్రామస్తులు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన రాదని హెచ్చరించారు.

## వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వ్యాధుల పట్ల అవగాహన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ గుమస్తాల సంఘం కార్యాలయంలో వాకర్స్ క్లబ్, అనకాపల్లి వారి మే నెల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో కంటి వ్యాధులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశంపై ఆప్తమాలజిస్ట్ దాడి పరమేశ్వరరావు ప్రసంగించారు. కంటి వ్యాదులు, నివారణోపాయాలు అనే అంశంపై ఆయన వాకర్స్ అడిగిన కంటి సమస్యలకు సమాధానాలు చెప్పారు . అన్ని అవయవాలలో నయనం ప్రధానం అనే విషయాన్ని పెద్దలు చెప్పిన మాటలు ఎప్పుడు గుర్తించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 40 మంది పాల్గొని వారి కంటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు పరమేశ్వరరావు ను సత్కరించారు.

అనంతరం వారికి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి మరియు కోశాధికారి శ్రీ భీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివ రావు(శివ), రాపేటి నారాయణ రావు, డాక్టర్ డి డి నాయుడు, ఆడారి మల్లికార్జున రావు, బొగ్గారపు వెంకట రమణ, నల్లాల దేముళ్ళు, కె.వి గౌరీపతి, కే వి వి సత్యనారాయణ, ఆళ్ళ ఓం రాం, డి ఎస్ ఎస మాణిక్యాల రావు, కె వీరభద్రరావు, టీఎస్ అప్పారావు, దాడి స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మలేసియా పర్యటన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 17 నుండి 21 వరకు మలేసియా రాజధాని కౌలాలంపూర్ లో మను జ్యోతి ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో మరియు మలేషియా తెలుగు అసోసియేషన్ సంస్థ సహకారం తో ప్రపంచ శాంతి సమావేశం జరిగింది సుమారు ఐదు రోజులు పాటు జరిగిన ఈ సమావేశం లో సుమారు 350 మంది పాల్గొన్నారు 21 న మంగళ వారం తో ముగిశాయి.ఈ సమావేశం లో నగర వాసి ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ చైర్మన్ హెూదాలో నర వ ప్రకాశ రావు పాల్గొన్నారు ప్రపంచ శాంతి స్వచ్ఛంద సంస్థ ల పాత్ర అనే అంశంపై పేపర్ సమర్పించి సమావేశం లో మాట్లాడారు .. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు ను నిర్వాహకులు సత్కరించారు . నర వ ప్రకాశ రావు కృత్నతలు తెలిపారు.ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మలేసియా తెలుగు అసోసియేషన్ సంస్థ సభ్యుల ల తో .ప్రత్యేక సమావేశం లో కూడా పాల్గొని ప్రసంగించారు.

## ఎన్నికల కౌంటింగ్ రోజు పటిష్టమైన భద్రతా చర్యలు






**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి పార్లమెంట్, 6 అసెంబ్లీ సెగ్మెంట్స్ కు (చోడవరం, మాడుగుల, అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం) జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించు టకు చెయ్యవలసిన కార్యాచరణ పై ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల మేరకు జిల్లా ప్రజలందరూ ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా జిల్లా యంత్రాంగానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని జిల్లా ఎస్పీ తో కలిసి శంకరం గ్రామం, కలెక్టరేట్ వద్ద గల ఫ్యూచర్ వరల్డ్ పాఠశాల నందు ఉన్న కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు ను మరియు ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయుట తదితర అంశాలపైన , స్ట్రాంగ్ రూము ను సందర్శించి, స్ట్రాంగ్ రూము లో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల మరియు కంట్రోల్ యూనిట్ రక్షణకు కేంద్ర బలగాలు, ఆర్మ్ రిజర్వు మరియు సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాట్లును సమీక్షించి ఎన్నికల కౌంటింగ్ రోజు, తదనంతరం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవలసిన భద్రత చర్యల గురించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.కౌంటింగ్ కి ముందుగానీ, కౌంటింగ్ రోజు గాని, కౌంటింగ్ తర్వాత గాని ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నామని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు.

కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, ఎవరు కూడా గుంపులుగా ఉండకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని, అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామన్నారు. ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని డీఐజీ సూచించారు.

డీఐజీ తో పాటు జిల్లా ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ ., అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు పాల్గొన్నారు.

## యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే యువకులకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐ.ఆర్. గంగాధర్ అన్నారు.మంగళవారం అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్ లో గల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి 33వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఐ.ఆర్.గంగాధర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ గ్రామీణ పంచాయతీలకు కేంద్ర నిధులు నేరుగా పంచాయితీ ఖాతాలకు వచ్చే విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ గారికే దక్కుతుందని గంగాధరన్నారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కూడా రాజీవ్ గాంధీకి దక్కుతుందని గంగాధర్ కొనియాడారు. దేశం కోసం దేశ భవిష్యత్తు కోసం రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చే బాధ్యత కాంగ్రెస్ వాదులపై ఉందని గంగాధరన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం గాంధీ కుటుంబం అని గంగాధరన్నారు .కాంగ్రెస్ పార్టీ ఆశయాలు సిద్ధాంతాలు నెరవేర్చడానికి ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి గంగాధర్ పూలమాల వేసి నివాళులర్పిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆశయాలకు,సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని కార్యకర్తలు నాయకులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్, కసింకోట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనేడ గజ్జాలు ,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కొల్లి సత్యరావు ,టి.సంతోష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలుఏడువాకుల దేవుడమ్మ,జూనియర్ న్యాయవాది జయశ్రీ, ఎరుకుల హక్కుల పోరాట కమిటీ అధ్యక్షుడు పూజారి నరసయ్య, ఓరేలా మోహన్ కృష్ణ, వెంకటరమణ మొదలగువారు పాల్గొన్నారు.

## చిత్ర కళా పోటీలతో సృజనాత్మకత, భావవ్యక్తీకరణ చేయవచ్చు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** చిత్ర కళా పోటీల్లో పాల్గొనడం ద్వారా సృజనాత్మకత, భావవ్యక్తీకరణ వెల్లివిరుస్తుందని తద్వారా ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి కె.చిట్టిబాబు పేర్కొన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో 15 రోజులుగా జరుగుతున్న ఉచిత చిత్ర లేఖనం శిక్షణా తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చిట్టిబాబు మాట్లాడుతూ చిత్రాన్ని ఆవిష్కరించడంలో గల నేర్పు, రంగుల కలయిక చిత్రకారుని ప్రతిభను, కళా దృష్టిని తెలియజేస్తాయని చెప్పారు. చిన్నతనం నుంచి విద్యార్థులకు చిత్ర కళలో మెళకువలు ఈ శిక్షణ శిబిరంలో నేర్పించడం అభినందనీయ మన్నారు. ప్రముఖ చిత్రకారులు రాజా రవి వర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడి రాజుల గురించి చిన్నారులు తెలుసుకోవాలన్నారు. బాల్య దశ నుంచి చిత్రలేఖనం అలవ వరచుకోవడానికి వీలుగా ప్రభుత్వ విద్యా సంస్థలు సేవలందిస్తు న్నాయన్నారు. చిత్ర లేఖనంపై ఆసక్తి కలిగేలా బొమ్మలు గీయడం, అంతే కాకుండా దగ్గరుండి ప్రాక్టీస్ చేయించడం ... విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడం ప్రధాన బాధ్యతగా తీసుకున్న శ్రీ గౌరీ గ్రంథాలయం కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. చిత్ర లేఖనం కొందరికి హాబీ, మరికొందరికి ప్యాషన్, ఒక అందమైన బొమ్మను చూస్తున్నప్పుడు కలిగే అనుభూతి వేయి వీణల సంగీతంతో సమానమన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుతో పాటు ఇతర వ్యాపకాలపైనా దృష్టిపెట్టాలన్నారు. ఆటలు, నృత్యాలు, కళలపైనా ఇష్టం పెంచుకోవాలన్నారు. అటువంటి వాటిలో చిత్రలేఖనం ప్రధానంగా నిలుస్తుందని ఎంఇవో చిట్టి బాబు అన్నారు. మదిలో మెదిలే ఆలోచనలు, ఊహకందని ఆలోచనలకూ దృశ్య రూపం ఇవ్వడమే చిత్ర లేఖనమన్నారు. విద్యార్థుల్లోని సహజమైన సృజనాత్మక నైపుణ్యం పెంపుదలకు చిత్రలేఖనం దోహదపడుతుందన్నారు.

శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, డ్రాయింగ్ సీనియర్ ఉపాధ్యాయుడు బొడ్డేడ సూర్యనారాయణ, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్.ఎఫ్.ఐ.), బొడ్డేడ జగ్గ అప్పారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనంతరం డ్రాయింగ్ పోటీలలో సీనియర్స్, జూనియర్స్ విభాగం విజేతలకు మండల విద్యాశాఖాధికారి చిట్టిబాబు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇవో చిట్టిబాబు, డ్రాయింగ్ శిక్షకులు ఎం.అనిరుద్, సానా లావణ్య, కర్రి హారికలను ఘనంగా గ్రంథాలయం కార్యవర్గం సత్కరించింది.

## ఘనంగా సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి వేడుకలు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి గేయాలు ఒక అద్భుతమని వక్తలు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింపజేసే విధంగా పాటలు ఉండేవన్నారు. పట్టణంలోని విజయ రెసిడెన్సిలో సోమవారం ప్రముఖ సినీ పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లికి చెందిన సీతారామ శాస్త్రి యుక్త వయసులోనే ఎన్నో పాటలు రచించి మెప్పించేవారన్నారు. కార్యక్రమంలోఅతిథిగా పాల్గొన్న డాక్టర్ డి డి నాయుడు మాట్లాడుతూ సీతారామశాస్త్రి ప్రతిభ ను వివరించారు. సంఘ ప్రతినిధి సత్యారావు మాస్టారు, నాయక్, నాట్యం సినిమా డైరెక్టర్ రేవంత్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విజన్ 2025 - ఇన్‌క్లూజివ్ ఆంధ్రా మాస్టర్ ట్రైనర్లకు గూగుల్ సంస్థ ప్రత్యేక శిక్షణ



**రావికమతం మండలం, (విశాఖ సమాచారమ్):** గూగుల్ సంస్థ యొక్క గూగుల్ ఇండియా యాక్సెసిబిలిటీ ఇంజనీర్ అజిత్ నారాయణ్ నేతృత్వంలో గూగుల్ ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా విజన్ 2025 ఇన్‌క్లూజివ్ ఆంధ్రప్రదేశ్ యొక్క మాస్టర్ ట్రైనర్‌లు ఎపి సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం రాష్ట్ర సీనియర్ అడ్వైజర్ రామ్ కమల్, ఏపీ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం కన్సల్టెంట్ అధికారి డాక్టర్ నరసింహం బాబ్జీ, స్టేట్ అసిస్టెంట్ ఐ.ఈ.కోఆర్డినేటర్ మల్లికార్జున రావు విజన్ 2025 ఇన్ క్లూజివ్ ఆంధ్ర మాస్టర్ ట్రైనర్లు , బొడ్డు మహలక్ష్మి నాయుడు,సునీల్ లకు గూగుల్ క్రోమ్‌బుక్ మరియు దాని యాక్సెసిబిలిటీ ఫీచర్లపై శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యా శాఖ ప్రతిష్టాత్మకమైన విజన్ 2025 - ఇన్‌క్లూజివ్ ఆంధ్ర అనే ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలో 45000 ప్రభుత్వ పాఠశాలలో వున్న సెన్సరీ, దృష్టి లోపం,హార్డ్ అఫ్ హియరింగ్ మరియు న్యూరోడైవర్స్ గ్రూప్ దివ్యాంగ విద్యార్థుల అభ్యాస అడ్డంకులను అధిగమించడానికి డిజిటల్‌గా యాక్సెస్ చేయగల బోధనా విధానాలను ఆవిష్కరించడం జరిగింది.

గూగుల్‌లో శిక్షణా సమయంలో అనేక దేశాలలో విద్యార్థులు ఉపయోగించే ల్యాప్‌టాప్‌లలో ఒకటైన క్రోమ్ బుక్ యొక్క కొత్త యాక్సెసిబిలిటీ ఫీచర్‌లను తెలియజేయడం జరిగింది.

మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివ్యాంగుల డిజిటల్ విద్యకు సంబంధించి కొన్ని ప్రత్యేకమైన గూగుల్ యాప్లను మనం రాష్ట్రం ఎక్కువగా ఉపయోగించడం వలన రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులకు ట్రెనింగ్ ఇచ్చిన రాష్ట్ర రిసోర్స్ పర్సన్ లు బొడ్డు మహాలక్ష్మి నాయుడు మరియు సునీల్ ను గూగుల్ సంస్థ ప్రతినిధి అజిత్ నారాయణ గారు అభినందించారు.

## ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నాం: ఏపీ స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం




**అమరావతి:** రాష్ట్రంలో మే 22 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వానికి స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం తెలిపింది. ఈ మేరకు సోమవారం ఓ లేఖ రాసింది..

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీ షాకు రాసిన ఈ లేఖలో పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడాన్ని ప్రస్తావించింది. మే 22 నుంచి ఏపీలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తామని స్పష్టం చేసింది. గతేడాది ఆగస్టు నుంచి ఉన్న రూ.1,500 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేసింది..

సుదీర్ఘ కాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం తెలిపింది. పలుమార్లు లేఖలు రాసినా ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్లు మాత్రమే చెల్లింపులు చేశారని లేఖలో పేర్కొంది.

### మే 21న ప్రపంచ టీ దినోత్సవం సందర్భంగా ఖంభోలాజ్ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 21 మే 2024, మంగళవారం ఉదయం 9 గంటలకు సన్మాన సభ ఏర్పాటు చేయబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కె. విశాఖపట్నం నుండి వి శర్మ, విశిష్ట అతిథులకు సరస్వతీ వందన, సంస్థ అధినేత్రి శైలేష్ వానియా శైల్ పరిచయం, ప్రీతి పర్మార్ పుష్పగుచ్ఛాలు అందించారు, మొత్తం 41 మంది కవులను సన్మానించారు. వాట్సాప్ గ్రూపులో 521 మందితో కూడిన గుంపు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి వచ్చిన డిజిటల్ సర్టిఫికెట్‌ని డాక్టర్ శైలేష్ వానియా శైల్ పంపిణీ చేశారు ప్రదేశ్, ఢిల్లీ, బీహార్ తదితర ప్రాంతాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. 9 గంటలకు జాతీయ గీతాలాపన వేదిక ఆర్ మెహతా నీలేష్ రాథోడ్ నీల్‌జీ భారత్ మాతా కీ జై నాద్‌తో వీడ్కోలు పలుకుతూ సర్టిఫికెట్‌ను సిద్ధం చేశారు.

# 23న పరవాడలో ముత్యాలమ్మ తల్లి పండుగ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ లో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి అమ్మవారి పండగ మహోత్సవం ఈనెల 23 గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కావున భక్తులు యావన్మంది విచ్చేసి అమ్మవారిని దర్శనం చేసుకుని అమ్మవారి తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరుచున్నారు.

# గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ప్రతి విద్యార్థి చదువుతో మంచి భవిష్యత్తు కోసమై బాషా నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు వై.అప్పారా అన్నారు. వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా మంగళవారం నాడు స్థానిక యలమంచిలి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.ఆనంద్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్, జనరల్ నాలెడ్జ్, నీతి కథలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.దుర్గారావు,విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితుల వేదన ప్రసారం చేయడం తప్పెలా అవుతుంది



బాధితుల వేదన ప్రసారం చేయడం తప్పెలా అవుతుందని జనసేన నేత నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. విశాఖలో బాధితులు చెప్పిందే మీడియా చూపించిందన్నారు. మీడియా ప్రతినిధులను భయపెట్టే చర్యలు సరికాదన్నారు. మీడియాపై పెట్టిన కేసులు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని అర్థమవుతోందన్నారు. ధనలక్ష్మి కుటుంబంపై దాడికి కారకులెవరో పోలీసులే చెప్పాలని డిమాండ్ చేశారు.

విశాఖ కంచరపాలెంలో తమకు ఓటు వేయలేదన్న కారణంతో ఓ కుటుంబంపై వైకాపా శ్రేణులు దాడి చేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. ఈ ఘటనకు సంబంధించిన వార్తలను ప్రసారం చేసిన సంస్థలపై కేసులు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే తెదేపా నేత అచ్చెన్నాయుడు ఈసీకి ఫిర్యాదు చేశారు. మీడియా సంస్థలపై పెట్టిన కేసులు ఎత్తివేసి, కేసును తప్పుదారి పట్టించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరిన విషయం తెలిసిందే.

## చెప్పుల వ్యాపారి ఇంట్లో రూ.100 కోట్లు..!



యూపీలోని ఓ చెప్పుల వ్యాపారి ఇంట్లో ఐటి అధికారులు రూ.100 కోట్లు గుర్తించారు. ఆగ్రాలోని ముగ్గురు చెప్పుల వ్యాపారులకు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఐటీ దాడులు చేసింది. మొత్తం 14 ప్రాంతాల్లో రెండు రోజులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ వ్యాపారి ఇంట్లో రూ.100 కోట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంచాలు, అల్మారాలు, బ్యాగుల్లో నోట్ల కట్టలు కుక్కారు. వాటిని లెక్కించేందుకు క్యాష్ మెషిన్లు కూడా మొరాయించాయి.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** 32/11 కెవి దార్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి కొత్తలి ఫీడర్ కు సంబంధించి లైన్ నిర్వహణ పనులు, మరమ్మత్తుల నిమిత్తం నేడు ఉదయం 10 గం.ల నుంచి 12 గంటల వరకు,మధ్యాహ్నం 2గం.ల నుంచి సాయంత్రం 6 గం.ల వరకు యలమంచిలి మండలంలో కొత్తలి, పేరంటాళ్ల పాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ అధికారి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేసే ప్రదేశాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్యాయంగా ఉదయం 5 గం.ల నుండి 10 గం.ల వరకు అలాగే మధ్యాహ్నం 12 గం.నుండి 2 గం.ల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# ఆ పోలీసులకు రెడ్ బుక్ టెన్షన్?



రెడ్ బుక్...టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కొద్ది నెలల క్రితం చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా బాగా హైలైట్ అయిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం చెప్పినదానికి తల ఊపి టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన కొందరు పోలీసులు, అధికారుల పేర్లు ఈ రెడ్ బుక్ లో ఉన్నాయని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రెడ్ బుక్ లో పేర్లున్న పోలీసులు, అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని లోకేష్ హెచ్చరించారు. ఇక, లోకేష్ రెడ్ బుక్ పేరు చెప్పి అధికారులు, పోలీసులను భయపెడుతున్నారని కొందరు కోర్టు తలుపు కూడా తట్టారు

ఇటీవల ముగిసిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ రెడ్ బుక్ లో ఉన్న పోలీసులు, అధికారులకు టెన్షన్ పట్టుకుందని తెలుస్తోంది. వైసీపీ అండ చూసుకొని గతంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై రెచ్చిపోయిన కొందరు పోలీసులు, అధికారులు రేపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటి అన్న ఆలోచనలో పడ్డారట.

ఇక, వైసీపీకి గెలుపు అవకాశాలు తక్కువగా ఉన్నాయన్న సంకేతాల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు తో టచ్‌లోకి కొందరు వెళుతున్నారని తెలుస్తోంది.

వైసీపీ ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు తాము చేయాల్సి వచ్చిందని, టీడీపీకి వ్యతిరేకం కాదని వివరణనిచ్చే ప్రయత్నాలు వారు చేస్తున్నారట. ఇక, జగన్ హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న టీడీపీ అనుకూల పోలీసులు, అధికారులు కొందరు చంద్రబాబును ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారట. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది...ఎవరిపై చర్యలుంటాయి అన్న సంగతి తేలాలంటే జూన్ 4 వరకు వేచిచూడక తప్పదు.

# లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలుస్తుంది



ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి దేనని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తాజాగా వెల్లడించారు. దేశంలో 5 వ విడత ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత.. మంగళవారం ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఎన్నికల్లో విజయం బీజేపీదేనని స్పష్టం చేశారు. అయితే లోక్‌సభలో సగం సీట్లే రావాల్సిన బీజేపీ.. 370 పైగా సీట్లు వస్తాయని రాజకీయ ఉపన్యాసాల ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేలా చేసి కమలం పార్టీకి క్రెడిట్ ఇచ్చారు. అయితే 370 సీట్లు అందుకోవడంలో మాత్రం బీజేపీ విఫలం అవుతుందని ప్రశాంత్ కిషోర్ తేల్చి చెప్పారు.

ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని చెప్పిన ప్రశాంత్ కిషోర్.. అయితే ఆ పార్టీ చెప్పినట్లుగా 370 స్థానాలు మాత్రం రావని తెగేసి చెప్పారు. అయితే ఈ సార్వత్రిక ఎన్నికల్లో 370, 400 సీట్లు సాధిస్తామని బీజేపీ తెలివిగా వ్యవహరిస్తోందని.. అయితే అదే రాజకీయాలను, ప్రజలను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఇలా 370, 400 వస్తాయని చెప్పడం.. ఆ పార్టీకి లాభమేనని వెల్లడించారు. అయితే బీజేపీకి 370 సీట్ల కంటే తక్కువ వస్తే.. అది తీవ్ర చర్చనీయాంశంగా మారుతుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.

గత 3, 4 నెలల నుంచి ఎక్కడ చూసినా 370 సీట్లు, 400 సీట్ల గురించే చర్చ జరుగుతోందని చెప్పిన ప్రశాంత్ కిషోర్.. ఇది బీజేపీ వ్యూహంలో భాగమో లేక ప్రతిపక్షాల బలహీనతగా భావించవచ్చని పేర్కొన్నారు. అయితే ఇది మాత్రం బీజేపీ టార్గెట్‌ను 272 నుంచి 370 కి పెరిగేలా చేసిందని తెలిపారు. ఇది తప్పకుండా బీజేపీకే లాభమని చెప్పారు. ప్రస్తుతం నరేంద్ర మోదీ ఓడిపోతారని ఎవరూ చెప్పలేరని.. అయితే బీజేపీ చెబుతున్నట్లు 370 సీట్లు మాత్రం రావని వెల్లడించారు. అయితే బీజేపీకి 320 సీట్లు వచ్చినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. 543 స్థానాలున్న లోక్‌సభలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 272 సీట్లు గెలుచుకుంటే సరిపోతుంది. ఇక 2014 లో నరేంద్ర మోదీ తొలిసారి అధికారంలోకి వచ్చిన ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్.. బీజేపీ, నరేంద్ర మోదీతో కలిసి పనిచేశారు.

2024 లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని.. కానీ 2019 ఎన్నికల్లో వచ్చిన సీట్ల కంటే కొంచెం ఎక్కువ స్థానాలు గెలువవచ్చని ప్రశాంత్ కిషోర్ అంచనా వేశారు. అధికారంలో ఉన్న పార్టీపై కోపం ఉంటే.. ఆ పార్టీకి సరైన ప్రత్యామ్నాయం ఉండాలని.. అప్పుడే ప్రజలు వారికి ఓటు వేస్తారని చెప్పారు. నరేంద్ర మోదీపై ప్రజల్లో ఆగ్రహం ఉందని చెప్పలేమని పేర్కొన్నారు. ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని ప్రాంతాల్లో ఉన్న దాదాపు 325 సీట్లు.. 2014 నుంచి బీజేపీకి బలమైన కోటగా ఉన్నాయని చెప్పారు. తూర్పు-దక్షిణ భారత దేశంలో బీజేపీకి పెద్దగా పట్టు లేదని.. ఏదైనా నష్టం జరిగితే అది ఆ ప్రాంతాల్లోనే జరగాలని ప్రశాంత్ కిషోర్ విశ్లేషించారు. అయితే ఈసారి మాత్రం బీజేపీకి దక్షిణాదిన, తూర్పున ఓట్లు, సీట్లు పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

అయితే నరేంద్ర మోదీ చేసిన పొరపాట్లను ఇండియా కూటమి నేతలు సరిగా ఉపయోగించుకోలేదని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఇండియా కూటమి ఏర్పాటే చాలా ఆలస్యం అయిందన్నారు. ఇక ఇండియా కూటమిలో ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించడంలో విఫలమైందని చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా బలమైన వ్యక్తిని, శక్తిని ఇండియా కూటమి చూపించలేకపోయిందని పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే తమ లక్ష్యం అని చెబుతున్న ప్రతిపక్షాలు గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో దారుణమైన ఓటమిని చవిచూసినట్లు తెలిపారు.

# వేసవి శిబిరంలో రోబోటిక్స్‌పై అవగాహన



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరహాలయ్య పేటలోని యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు 11వ రోజు మంగళవారం విద్యార్థులకు రోబోటిక్స్ ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. మహమ్మద్ జమీల్ అలీ మిత్ర బృందం ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రోబోటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు తాటిగడప సుబ్బారావు విద్యార్థులకు పద్యాలు పాడటంలో శిక్షణ ఇచ్చి విద్యార్థులతో పద్యాలు పాడించారు. అలాగే బుద్దా శ్రీనివాస్, దుంగల శ్యాం కుమార్‌లు కాగితాలపై రంగు రంగుల బియ్యపు గింజలతో సీతాకోకచిలుకలను రూపొందించడంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బాలలకు అంగనవాడీ యూనియన్ నాయకులు టి ఎల్ పద్మావతి కథలు చదవడం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. దుంగల పూజితా సూర్యశ్రీ కరాటేలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. నీలపాల కృష్ణ కర్రసాము లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష ,కార్యదర్శులు కూని రెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, మంజుల, అమృత, సాయి, బంగారం, మణికంఠ, నేహా, రేణుక, శ్రీజ, కె రవి, పవన్ తదితరులు క్యాంపు నిర్వహణలో సహాయ సహకారాలు అందించారు.

# త్వరలో కూటమి అధికారం చేపట్టబోతోంది :మాజీ మంత్రి అమరనాథరెడ్డి



**చిత్తూరు:** రాష్ట్రంలో త్వరలో కూటమి అధికారం చేపట్టబోతోందని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన వి.కోటలోని పియంఅర్ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎన్నికలలో కష్టపడి పనిచేసిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ వి.కోట, బైరెడ్డిపల్లి మండల నాయకులతో ఆయన వేర్వేరు ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌లో కూటమి పార్టీకే సానుకూల ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పలమనేరు నియోజకవర్గంలో సైతం టిడిపి జెండా ఎగరడం ఖాయమన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్ గౌడ్, సుబ్రహ్మణ్యం శెట్టి, నాయకులు రాంబాబు, చౌడప్ప, కృష్ణవేణి జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న టిడిపి సీనియర్ నాయకులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం శివాజీ పాలెం గ్రామదేవత చిన్న పోలమాంబ అమ్మవారి వార్షిక మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకట్రావు మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ వెంకటరమణ, గ్రామ సంఘం అధ్యక్షులు అప్పల మూర్తి సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, గ్రామ సంఘం పెద్దలు తదితర పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవంలో పాల్గొన్న వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 31 వార్డ్ పరిధిలో కృష్ణా గార్డెన్స్ , ప్రేమ సమాజంరోడ్ లో గల శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా దక్షిణ నియోజకవర్గం కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వంశీ గారు మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖంగా వుండాలని అదేవిధంగా ఆహ్వానించిన పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు వానపల్లి ఫణి గాయత్రి కుమారి, సారిపల్లి మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎంవీవీ సత్యనారాయణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్థానిక జీవీఎంసీ 22వ వార్డు పీతలవాని పాలెం మరియు శివాజీ పాలెం గ్రామ దేవత అయినటువంటి శ్రీ పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి జాతర మహోత్సవాలు పురస్కరించుకొని వేకువజాము నుండి విశేష పూజలు అర్చనలు కుంకుమార్చనలు ఆలయ అర్చకులచే నిర్వహించారు. ఈ సందర్భముగా పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు దర్శనానంతరము తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో 22వ వార్డు వైసిపి అధ్యక్షుడు పీతల గోవిందు, మత్స్యకార వైసీపీ నాయకుడు గంపల వెంకట రామచంద్రరావు,చొక్కార శేఖర రావు అధిక సంఖ్యలో మహిళలు భక్తులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవ వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని గవరపాలెం విజ్ఞాన సమితి కేంద్రం వద్ద కొలువైన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఏడో వార్షికోత్సవం సందర్భంగా అలయ కమిటీ ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గారు మంగళవారం అలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన దాడి రత్నాకర్ ని కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి శాలువతో ఘనంగా సత్కరించి స్వామి తీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని రత్నాకర్ ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులు భారీఎత్తున విచ్చేసి శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల చంద్రదేవ్, కోరిబిల్లి పరి, విల్లూరి బాలు, సూరిశెట్టి వెంకటరావు, మళ్ల రూపేష్, బుద్ద మోహనరావు, కొయిలాడ వెంకట సత్యనారాయణ, కొయిలాడ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులతో లింకు.. ఏపీ టెకీ అరెస్టు!



ఇటీవల బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ లో బాంబు పేలుడు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. బ్యాగ్ తగిలించుకుని, టోపీ పెట్టుకుని వచ్చిన ఓ వ్యక్తి కేఫ్ లో ఓ మూలన బాంబు పెట్టాడు. ఈ ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో పలువురిని అరెస్టు చేసింది. వీరికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయని తేలింది.

కాగా రామేశ్వరం కేఫ్ ఘటనకు సంబంధించే ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా టెకీని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బాంబు పేలుడు ఘటన జరిగినప్పటి నుంచి ఎన్ఐఏ అధికారులు చురుగ్గా వ్యవహరిస్తున్నారు. అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. పటిష్ట నిఘాను ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలో అనంతపురంలో ఓ టెకీకి ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్నారు. తాజాగా అతడిని ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన సోహెల్ అనే వ్యక్తి బెంగళూరులోని ఓ ఐటీ సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు అనుమానం. అంతేకాకుండా అతడి బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తం డబ్బు జమైందని సమాచారం.

ఈ క్రమంలో అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ఆత్మకూర్ వీధిలో ఉన్న సోహెల్ ఇంటిపై ఎన్ఐఏ అధికారులు దాడులు చేశారు. సోహెల్, అతని తండ్రి అబ్దుల్, ఇతర కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారించారు.

ఇటీవల సోహెల్ బ్యాంకు ఖాతాలోకి పెద్ద మొత్తం ఎలా వచ్చిందనే విషయాన్ని సోహెల్ కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. విచారణ అనంతరం సోహెల్ ను అదుపులోకి తీసుకున్న అధికారులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు అతడిని తరలించారు.

ప్రస్తుతం సోహెల్ కు ఉగ్రవాదులతో సంబంధాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# మలేరియా నిర్ధారణ కు మైక్రోస్కోప్ విధానాన్ని ఎక్కువగా అవాలంబించాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఆసుపత్రిలో మలేరియా,డెంగ్యూ నిర్ధారణ పరీక్షా కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రతీ రోజూ నిర్వహిస్తున్న మలేరియా,డెంగ్యూ జ్వర నిర్ధారణ పరీక్షలు,వాటి నివేదికల వివరాల పై ఆరా తీశారు.రికార్డులు పరిశీలించి ఎంఎఫ్7 పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. మలేరియా నిర్ధారణకు మైక్రోస్కోప్ పరీక్షా విధానాన్ని ఎక్కువగా అవలం బించాలని ఆదేశించారు. సేకరించిన రక్త పూతల స్లైడ్స్ ను పరిశీలించారు.కచ్చితమైన ఫలితాల కొరకు స్లైడ్స్ ను సకాలంలో పరీక్షలు జరపాలన్నారు.డెంగ్యూ నిర్ధారణ పరీక్షా పరికరాన్ని(ఎలీసా రీడర్)పనిచేస్తున్న తీరును పరిశీలించారు.క్షేత్ర స్థాయి నుండి డెంగ్యూ తుది నిర్ధారణ కొరకు నమూనాలు ఏ మేరకు వస్తున్నాయని ఆరా తీశారు. మలేరియా,డెంగ్యూ నిర్ధారణ అయితే వెంటనే ఐహెచ్ఐపి లో ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. అనంతరం అక్కడ ల్యాబ్ లో ట్రైనీ సిబ్బందికి జ్వర నిర్ధారణ పరీక్షలు, మలేరియా,డెంగ్యూ జ్వర లక్షణాలు తదితర అంశాలపై వివరించారు .ఆయన వెంట ఏఎంఓ సూర్య నారాయణ ఉన్నారు.

# తమ ఎంపీకి బీజేపీ షాక్!



లోక్ సభకు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఐదు దశల పోలింగ్ పూర్తయింది. మరో రెండు దశల పోలింగ్ మిగిలి ఉంది. జూన్ 1తో మొత్తం ఏడు దశల పోలింగ్ పూర్తవుతుంది.

కాగా ఈసారి 400 ఎంపీ స్థానాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ పలువురు సిట్టింగ్ ఎంపీలకు సీటు నిరాకరించింది. వీరిలో వరుసగా పలు పర్యాయాలు ఎంపీలుగా గెలిచినవారు కూడా ఉండటం గమనార్హం. ఈ కోవలో కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా కూడా ఉన్నారు.

జార్ఖండ్ లోని హజారీబాగ్ ఎంపీగా జయంత్ సిన్హా ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఆయన ఇక్కడ బీజేపీ తరపున విజయం సాధించారు. ఈసారి బీజేపీ ఆయనకు సీటు ఇవ్వలేదు. జయంత్ సిన్హా తండ్రి యశ్వంత్ సిన్హా గతంలో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. అటల్ బిహారి వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు యశ్వంత్ సిన్హా కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా వ్యవహరించారు. హజారీబాగ్ నుంచి ఆయన నాలుగుసార్లు ఎంపీగా విజయం సాధించారు.

ఆ తర్వాత ప్రధాని మోదీతో వచ్చిన పొరపొచ్చాలతో యశ్వంత్ సిన్హా బీజేపీ నుంచి వైదొలగి తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఆయన కుమారుడు జయంత్ సిన్హా మాత్రం బీజేపీలోనే కొనసాగారు.

కాగా ఈ ఎన్నికల్లో జయంత్ సిన్హా ప్రాతినిధ్యం వహిస్తున్న హజారీబాగ్ సీటును బీజేపీ అధిష్టానం మనీశ్ జైశ్వాల్ కు ఇచ్చింది. అప్పటి నుంచి జయంత్ సిన్హా ప్రచారంలో పాలు పంచుకోవడం లేదని అంటున్నారు. అలాగే తన స్థానంలో వచ్చిన మనీశ్ కు ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

అంతేకాకుండా తాజాగా జరిగిన పోలింగ్ లోనూ జయంత్ సిన్హా తన ఓటు హక్కును కూడా వినియోగించుకోలేదని సమాచారం. దీంతో బీజేపీ అధిష్టానం అగ్గిమీద గుగ్గిలమైంది. ఎంపీగా ఉంటూ ఓటు హక్కు వినియోగించుకోకపోవడంతో పాటు పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు ఇవ్వకపోవడం, ప్రచారంలో పాలు పంచు కోకపోవడంపై కన్నెర్ర జేసింది.

బీజేపీ ఎంపీ కనీసం ఓటు కూడా వేయలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేసే అవకాశం ఉండటంతో జయంత్ సిన్హాకు బీజేపీ అధిష్టానం నోటీసులు జారీ చేసింది. హజారీబాగ్ లోక్ సభ స్థానం అభ్యర్థి గా మనీశ్ జైస్వాల్ ను ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదని ఆక్షేపించింది. అలాగే కనీసం ఓటు కూడా వేయకపోవడం సరికాదని పేర్కొంది. మీ ప్రవర్తన వల్ల పార్టీ ప్రతిష్ట దెబ్బతిందని షోకాజు నోటీసుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల్లోగా ఈ షోకాజు నోటీసులకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

కాగా ఈ నోటీసులపై జయంత్ సిన్హా ఇంకా స్పందించలేదు. ఆయన కూడా బీజేపీకి రాజీనామా చేస్తారని ఆర్జేడీలో లేదా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది.

# అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి హఠాన్మరణం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎపి అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు వై. తులసి సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు.తులసి మరణం యూనియన్ కి, ఉద్యోగులకు తీరని లోటు. ఆమె మరణానికి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్, అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, మున్సిపల్ యూనియన్ గౌ. అధ్యక్షులు పి.వెంకటరెడ్డి , అంగన్‌వాడీ రాష్ట్ర నాయకులు నాగశేషు, కుమారి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్ తదితరులు తులసి భౌతిక దేహంపై సిఐటియు జెండా కప్పి ఘనంగా నివాళులు అర్పించి, సంతాపాన్ని తెలిపారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

తులసి అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసారు. జనవరి మాసంలో అంగన్వాడీ ఉద్యోగుల యూనియన్ చేపట్టిన సుదీర్ఘ సమ్మెలో పట్టు విడవకుండా, ఉద్యోగులను ఐక్యం చేస్తూ సమ్మె విజయవంతానికి విశేషంగా కృషి చేశారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం లెక్క చేయకుండా ధైర్యంగా నిలబడ్డారు. గతంలో టిడిపి ప్రభుత్వ నిర్బంధాన్ని కూడా ఆరకంగానే ఎదుర్కొన్నారని వారు గుర్తుచేసారు. తులసి అల్లిపురం ఎల్లపువీధిలో నివసిస్తున్నారు. తులసి మృతి వారి కుటుంబానికే కాక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు తీరని లోటు అని కొనియాడారు. తులసీ పోరాట స్ఫూర్తితో అంగన్‌వాడీ కార్మికుల హక్కుల కోసం మరింత ఐక్యంగా పోరాడతామని తెలిపారు.

ఈ అంతిమయాత్రలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి. గౌ.సలహాదారు బృందావతి, ప్రాజెక్టు లీడర్స్ వెంకటలక్ష్మి, నూకరత్నం, శోభారాణి, పద్మ, లక్ష్మి, ఆశా వర్కర్స్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, సీతా తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే జీతాలు చెల్లించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ ప్లాంట్ లోని కోకో ఒవేన్, సెంటర్ ప్లాంట్, ఆర్ ఎం హెచ్ పి, బ్లాస్ట్ ఫర్నిస్, ఎస్ఎంఎస్, మిల్స్, ఆక్సిలరీ షాప్స్ అన్ని విభాగాలను విభాగాధిపతి కార్యాలయం ఎదుట స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ లోని ఐ ఎన్ టి యు సి మినహా మిగిలిన కార్మిక సంఘాలన్నీ ధర్నాలు నిర్వహించారు. వీటిలో యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికుల నినదించారు. అనంతరం విభాగాధిపతు లకు వినతి పత్రం అందజేశారు.

ఈ ధర్నాలను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే లేనివిధంగా నేటి యాజమాన్యం కార్మికుల పై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని వారు తీవ్రంగా విమర్శించారు. కార్మికులకు న్యాయంగా రావలసిన వేతనాలను ఆలస్యం చేసి కార్మికుల ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేస్తుందని వారు వివరించారు. కార్మికులకు వేతనాలు చెల్లించలేని స్థితిలో స్టీల్ యాజమాన్యం లేదని కావాలనే ఈ చర్యలకు దిగిందని వారు తీవ్రంగా తప్పు పట్టారు. కనుక యాజమాన్యం మొండి వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాల ద్వారా ప్రతిఘటించాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు రామస్వామి, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాస రాజు, బి అప్పారావు, గంగాధర్, టి వి కె రాజు, నీలకంఠం, పుల్లారావు, మరిడయ్య, కె బాలశౌరి, బియ్యం మధుసూదన్, వి ప్రసాద్, కె ఆర్ కె రాజు, డి సత్యనారాయణ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పరంధామయ్య, సిహెచ్ సన్యాసిరావు, డి సురేష్ బాబు, డి వి రమణారెడ్డి, రామ్ కుమార్ తదితరులతోపాటు అధిక సంఖ్యలో కార్మికులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ కి నివాళులర్పించిన పిసిసి ప్రతినిధి సయ్యద్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం స్వర్గీయ షహీద్ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం లోని రాజీవ్ స్మృతి భవన్ దగ్గర రాజీవ్ గాంధీ గారి విగ్రహం దగ్గర రాజీవ్ గాంధీ ఫోటో పెట్టి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పిసిసి ప్రతినిధి సయ్యద్ అబిదా మరియు పరిశోధన విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ విజయ్ చంద్ర. జమ్మలమడుగు ఇంచార్జ్ పాశర్ల ప్రసాద్ మరియూ 72 వ వార్డు మాజీ కార్పొరేటర్ పాశర్ల వసంత కళ్యాణి, యూత్ కాంగ్రెస్ గణేష్,పెద్ద జాలరిపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సామాజిక కార్యకర్త గురునాథరావు, డాక్టరేట్ సంస్కృతం సంస్కృత లెక్చరర్ పద్మనాభం, డాక్టరేట్ యోగా, కన్సూషనర్స్ జాతీయ



అవార్డు గ్రహీత అధ్యక్షుడు అవార్డి లీలాప్రసాద్ రెడ్డి, కుమార్ Msc కంప్యూటర్ పాల్గొన్నారు.


Sugar Free Fitearly
నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन फिट एर्ली
వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?
మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?
దిగులు చెందకండి.
"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.
సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ
తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కంమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com
HERBINDO LABS PRIVATE LIMITED ® HEALTH AND HAPPINESS
Compli
HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# తేజ పిండివంటలకు విశేష ఆదరణ



**యలమంచిలి (విశాఖ సమాచారమ్):** తేజ ఇంటి వంటలను విదేశాలలో మార్కెటింగ్ చేయుటకు తన వంతు సహకారం అందిస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త గంధం సునీత గిరిధర్ అన్నారు. ఎలమంచిలి లో తేజ ఇంటి వంటలు ప్రథమ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు, రంగులు, డాల్డాలు లేకుండా అందరికీ మంచి ఇంటి వంటలు అందించాలని సంకల్పంతో తేజ ఇంటి వంటలను స్థాపింప చేయడం అభినందనీయమని అన్నారు. 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ఈ సంస్థను ఒక సంవత్సరకాలంలో మంచి గుర్తింపు, పురోగతి సాధించిన తేజ వంటిల్లు వ్యవస్థాపకురాలు ఆకొండి లక్ష్మిను ఆమె అభినందించారు.

ముఖ్య అతిథిలు కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు శైలజ, దివ్యసుధ ప్రసంగిస్తూ మార్కెటింగ్ మరియు తయారీలో తమ అమూల్యమైన సలహాలను అందించారు. అలాగే రానున్న రోజుల్లో తమ సంస్థ ద్వారా అన్ని విధములుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

మరో ముఖ్య అతిథి పెనుగల్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పి .నాగరాజు మాట్లాడుతూ తేజ వంటిల్లు వారికి మా బ్యాంకు ద్వారా పీఎంజేఆర్ వై లోను ద్వారా ఆరు లక్షల రూపాయలు ఇచ్చామని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో వారు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరంలో తేజ వంటలలో విశేష ప్రతిభ కనబరిచిన చందక లక్ష్మి, చుక్కల రాజేశ్వరిని ముఖ్య అతిథులు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకొండి మూర్తి, బి .భాస్కర్ ,లతా గంగరాజు,ఆకొండి రామ్మూర్తి , సిహెచ్. అరుణకుమారి దితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా పరదేశమ్మవారి పండుగ

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మున్సిపాలిటీలో పరిధిలో పాత ఎర్రవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ శ్రీ శ్రీ పరదేశమ్మవారి పండుగను మంగళవారం నాడు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండే గ్రామంలో భక్తులందరూ భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పసుపు కుంకుమలు,చీర రవికలను సమర్పించుకుని ఆశీస్సులు పొందారు. అయితే ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటంతో పోలీసు అధికారులు ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వలేదు. ఎర్రవరం కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, కో-అప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి,సియాద్రి శ్రీను, పాటుగా పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు.

Authorised
System Solution Provider for
VOLTAS
A TATA Enterprise
9 Planet Solutions
HVAC - VRF PROJECTS SALES & SERVICES
Our Services that will make you cool
Md. Ibrahim Khaleel
M: 094402 11943
Head Office
Plot No.P-58, Flat No.101, Taj Residency
Ashok Vihar Colony, Upparpally,
Hyderabad-500030, Telangana State,
E: 9planetsolutions2009@gmail.com
Branch Office
#13-2-18/4,Anthony Nagar,
Beside St.Anthony's High School,
Maharanipeta,Visakhapatnam-530002
Andhra Pradesh.

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



**నర్సీపట్నం టౌన్:** ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని నర్సీపట్నం డిఎస్పి మోహన్ హెచ్చరించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీలో కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనంతరం నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డిఎస్పి మోహన్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఫలితాలు వెలువడే వరకు ప్రజలందరూ సమయం పాటించి, పోలీసులకు సహకరించాలన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించామని, ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం ఉదయం నర్సీపట్నం మున్సిపాలిటీలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 68 ద్విచక్ర వాహనాలను, ఆటో, కారు, బొలెరో వాహనాలను గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించమన్నారు. వీటికి సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకు వెళ్ళవచ్చన్నారు. అదేవిధంగా ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అలాగే 144, 30 సెక్షన్లు అమలులో ఉన్నాయని, ఎక్కడ నలుగురికి మించి గుంపులుగా ఉండకూడదని, ప్రజలు అర్థం చేసుకొని పోలీసులకు సహకరించాలని డిఎస్పి మోహన్ కోరారు.

# అనకాపల్లి పట్టణం శివార్లలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## రికార్డ్సు లేని10 ద్విచక్ర వాహనాలు 3 ఆటోలు సీజ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ వారి ఆదేశాల మేరకు అనకాపల్లి సబ్ డివిజన్, అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ జి.శంకర రావు ఆధ్వర్యంలో ఎస్సైలు సత్యనారాయణ, అలీ షరీఫ్ మరియు అనకాపల్లి సబ్ డివిజన్ సిఐలు ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు సిబ్బంది తో సుబ్రహ్మణ్యం కాలనీ , డి.బి కాలనీ లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి రికార్డ్సు లేని10ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను మొత్తం 13 వాహనాలు అనకాపల్లి టౌన్ పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.ఈ సందర్భంగా అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం కాలనీ వాసులతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అనుమానస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన రాదని హెచ్చరిం చారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రటిష్ఠ ఏర్పాట్లను చేయాలని ఆదేశించిన కలెక్టర్, రిటెర్నింగ్ అధికారి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్. రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

కాకినాడ పార్లమెంటరీ నియోజక వర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మంగళవారం కాకినాడ జేఎన్టీయూ లోని సివిల్ డీపార్టమెంట్ పీజీ బ్లాక్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్ సుందర్ రెడ్డి పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు- 2024లో పోలైన ఈవీఎంలు ఇతర పోలింగ్ సామాగ్రిని జేఎన్టీయూలో నియోజక వర్గాల వారీగా ఆయా బ్లాకుల్లో సురక్షితంగా భద్రపరిచడం జరిగిందన్నారు. అదేవిధంగా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లను జేఎన్టీయూలోని సివిల్ డీపార్టమెంట్ పీజీ బ్లాక్ లోను, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజక వర్గాల స్ట్రాంగ్ రూముల వద్ద ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని ప్రశాంత వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

జయ జయ శంకర హర హర శంకర
కంచి పరమాచార్య ధార్మిక సేవా ట్రస్ట్, బెంగళూరు
(గో రక్షణ - వేద రక్షణ - ఆలయ రక్షణ - ధర్మ రక్షణ)
సమర్పించు
సమన్వయ సరస్వతి, వాగ్దేవీ వరపుత్ర, ఆర్ష విజ్ఞాన సముద్ధరణ దీక్షిత
బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం
అంశం: భీష్మ స్తవరాజం
తేది: మే 27, 2024 నుండి మే 31, 2024 వరకు
సాయంత్రం 7:00 గం. నుండి
యూట్యూబ్ లో ప్రత్యక్ష ప్రసారం
YouTube Youtube.com/c/SrisamavedamShanmukhaSarmaLive



మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 26-05-2024, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 3.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
9393949345, 8074541283
Compli

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
Office : 99487 49799. Arilova : 73825 85777 Maddilapalem : 99084 24231, Yelamanchili : 9441356676